Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి    సంపుటి (Vol) : 7    సంచిక (Issue) : 117    పేజీలు (Pages) : 8    వెల : రూ. 2.00    ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 12 - 11 - 2025

94406 62699    rajadhanivartalu    rajadhaniv    www.rajadhanivartalu.com    RNI No.: APTEL/2019/77985  Postal regd: GTR/114/2025-27    స్థాపితం : 2015

## ఢిల్లీ పేలుళ్ల కేసు ఎన్ఐఏకి అప్పగింత




**న్యూఢిల్లీ:** ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో చోటు చేసున్న భారీ పేలుడు ఘటనపై దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థకు కేంద్ర హోం శాఖ అప్పగించింది. దీంతో ఎన్ఐఏ వెంటనే రంగంలోకి దిగింది. ఘటనా స్థలికి చేరుకుని సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలింపులు, సాక్ష్యాల సేకరణ, స్థానిక అధికారుల సమన్వయంతో అనుమానితుల కదలికలు, ఘటన వెనుక కుట్రను కనిపెట్టే చర్యలు చేపట్టింది. ఈ ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయిన దరిమిలా ఇది ఉగ్రవాద చర్యగా కేంద్రం అనుమానిస్తుండటంతో ఎన్ఐఏకు దర్యాప్తు బాధ్యతను కేంద్రం అప్పగించింది.

**అమిత్‌షా అత్యున్నత భద్రతా సమావేశం**

భారీ పేలుడు నేపథ్యంలో ఢిల్లీతో సహా దేశవ్యాప్తంగా ఇతర ప్రాం తాల్లో భద్రతా పరిస్థితులను సమీక్షించేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మంగళవారంనాడు తన నివాసంలో రెండో సారి అత్యున్నత భద్రతా స్థాయి సమావేశం నిర్వహించారు. సుమారు గంటన్నరసేపు జరిగిన ఈ సమావేశంలో హోం సెక్రటరీ గోవింద్ మోహన్, ఐడీ డైరెక్టర్ తపన్ దేకా, ఢిల్లీ పోలీస్ కమిషనర్ సతీష్ గోల్చా, ఎన్ఐఏ డీజీ సదానంద్ వంసత్ దాటే, జమ్మూకశ్మీర్ డీజీపీ నలిన్ ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మాహుతి దాడి..**

ఘటనలో ఉపయోగించిన ఐ20 కారుకు పుల్వామాతో సంబంధం ఉందని ఢిల్లీ పోలీసులు చెబుతున్నారు. ఇది ఆత్మహుతి దాడి కావచ్చని అనుమానిస్తున్నారు. సోమవారం రాత్రి పహర్‌గంజ్, దర్యా గంజ్ సమీప ప్రాంతాల్లోని హోటళ్లపై పోలీసులు దాడులు చేశారు. హోటల్ రిజిస్ట్రర్లు తనిఖీ చేశారు. ఢిల్లీలో హైఅలర్ట్ కొనసాగిస్తున్నారు. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినళ్లలో నిఘాను కట్టుదిట్టం చేశారు.

## మొంథా తుఫాను నష్టంపై ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన కేంద్ర బృందం



**అమరావతి, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాను నష్టంపై ముఖ్య మంత్రి చంద్రబాబును కేంద్ర బృందం కలిసింది. కేంద్ర హోం శాఖ సంయుక్త కార్యదర్శి పాసుమీ బసు నేతృత్వంలో సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రితో కేంద్ర బృందం భేటీ అయ్యింది. రాష్ట్రంలో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటించి నష్టాన్ని అంచనా వేసింది. కోనసీమ, తూర్పు గోదావరి, ఏలూరు, కృష్ణా, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో వేర్వేరు ప్రాంతాలను సందర్శించింది. రూ.5,267 కోట్ల మేర తుఫాను నష్టం వాటిల్లినట్టు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఓ మధ్యంతర నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. తక్షణ సాయంగా రూ.2,622 కోట్లను మంజూరు చేయాలని కేంద్రాన్ని సర్కార్ కోరింది. రాష్ట్ర వ్యాప్తంగా 443 మండలాల్లోని 3,109 గ్రామాలు మొంథా తుఫాను కారణంగా ప్రభావితం అయ్యాయని కూటమి ప్రభుత్వం పేర్కొంది. దాదాపు 10 లక్షల మంది తుఫాను, భారీ వర్షాలకు ప్రభావితం అయ్యారని నివేదికలో వెల్లడించింది. 9960 ఇళ్లు నీట మునిగాయని, 1.11 లక్షల కుటుంబాలు నిరాశ్రయులయ్యారని సర్కార్ పేర్కొంది. తుఫానుతో పాటు భారీ వర్షం కారణంగా 4566 ఇళ్లు దెబ్బతిన్నాయని స్పష్టం చేసింది. దాదాపు 1.61 లక్షల హెక్టార్లలో పంట దెబ్బతిందని.. 3.27 లక్షల మంది రైతులు నష్టపోయారని కేంద్రానికి నివేదించింది. వ్యవసాయ పంటలతో పాటు ఆక్వా, పశుసంవర్ధకం, చేనేత రంగం కూడా తీవ్రంగా నష్టపోయినట్టు వెల్లడించింది. 4794 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని, 12,856 విద్యుత్ స్తంభాలు నేల కూలినట్టు స్పష్టం చేసింది. అలాగే 2,318 ట్రాన్సఫార్మర్లు పాడయ్యాయని నివేదికలో పేర్కొంది. మొంథా తుఫాను కారణంగా పంటలు, రహదారులు, ఇళ్లు, ఇతర మౌలిక సదుపాయాలకు రూ.6,384 కోట్ల మేర నష్టం వాటిల్లిందని వెల్లడించింది. తుఫాను వల్ల నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు 22 జిల్లాల్లో 1.92 లక్షల మందిని రిలీఫ్ క్యాంపులకు తరలించామని వెల్లడించింది. 3.36 లక్షల కుటుంబాలకు రూ.3 వేల చొప్పున తక్షణ ఆర్థిక సాయంగా అందించినట్టు కేంద్ర బృందానికి ప్రభుత్వం తెలియజేసింది.

## స్మాల్ పత్రికల సమస్యలను పరిష్కరించండి

### - సమాచార శాఖా మంత్రి పార్థసారథి, డైరెక్టర్ విశ్వనాథన్‌కు ఆంధ్రప్రదేశ్ ఎంప్యానల్డ్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ వినతి

**అమరావతి, (రాజధాని వార్తలు):** స్మాల్ దినపత్రికలకు ప్రెస్ అక్రిడేషన్లు పెంపు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ ఎంప్యానల్డ్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందం సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, డైరెక్టర్ కె.ఎన్. విశ్వనాథన్‌లను కోరారు. ఈ మేరకు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వారికి అందజేశారు. ప్రెస్ అక్రిడేషన్ల ప్రక్రియకు వెబ్ సైట్ ప్రారంభించిన సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలిపారు. జీవో నెంబర్ 84/2025 వల్ల తగ్గిన అక్రిడేషన్లు పెంపు, నియోజకవర్గాల వారీగా జారీ, 2018 సం. నుండి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లింపు, రేటు కార్డు పెంచి అమలు, తక్షణమే స్లాబ్ రేటు పెంపు, ఎంప్యానల్మెంట్ పెండింగ్ ఫైళ్ళు పబ్లికేషన్ సెంటర్, ప్రింటింగ్ ప్రెస్ చిరునామాలు, ఓనర్ షిప్ మార్పు పోస్టల్ లైసెన్స్‌లాంటి కొన్ని మినహాయింపులతో పరిష్కారం, కొత్తగా ఎంప్యానెల్ మెంట్ ప్రక్రియ, ఎంప్యానల్మెంట్ లేని దినపత్రికలు, పిరియాడికల్స్‌కు యాడ్స్ విడుదల తదితర సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. వాటిపై మంత్రి, డైరక్టర్ స్పందిస్తూ కొన్ని పరిష్కరిస్తామని, మరికొన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. వెబ్ సైట్‌ను ప్రారంభించిన సందర్భంగా మంత్రిని సత్కరించబోయే సరికి మిమ్మల్ని సత్కరిస్తానంటూ ఆ దుస్సాలువాను తీసుకొని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వల్లూరు ప్రసాద్ కుమార్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎంప్యానల్డ్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. సత్యనారాయణ, ఉపాధ్యక్షులు వల్లూరు ప్రసాద్ కుమార్, నందిగం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## కర్నూలుకు అతిపెద్ద బేవరేజెస్ ప్లాంట్.. భారీగా ఉద్యోగాలు : మంత్రి టీజీ భరత్

**కర్నూలు, (రాజధాని వార్తలు):** కర్నూలు జిల్లా బ్రాహ్మణపల్లిలో రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్‌కు ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. బ్రాహ్మణ పల్లిలో మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. ప్రపంచంలో రెండవ అతిపెద్ద బేవరేజెస్ ప్లాంట్ కర్నూల్ జిల్లాకు తీసుకొచ్చామన్నారు. సీఎం చంద్రబాబు బ్రాండ్‌తోనే ఇది సాధ్యమైందని తెలిపారు. మెక్సికో తర్వాత రెండో ప్లాంట్ కర్నూలుకు వచ్చిందని చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే అతిపెద్ద రెండో ప్రాజెక్ట్ కర్నూలులో నెలకొల్పుతున్నారని తెలిపారు. మూడు వేల కోట్లతో రిలయన్స్ కర్నూలులో పెట్టుబడులు పెడుతోందని... దాదాపు ఐదు వేల మందికి ఉపాధి లభించనుందని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాన్ని అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ప్లాంట్‌ను అనుకున్న సమయానికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ ప్లాంట్ రావడం వల్ల స్థానిక యువతకు భారీగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఎయిర్ పోర్ట్‌లో శిక్షణా సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సిగాచి కెమికల్స్ ఓర్వకల్లుకు



కెమికల్ ప్లాంట్ వచ్చిందని తెలిపారు. ప్రతి జిల్లాల్లో స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేష్ తెలిపార న్నారు. సెమీ కండక్టర్ పరిశ్రమకు రూ.23 కోట్లతో మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. సీబీఎన్ బ్రాండ్‌తోనే పరిశ్రమలు ఏపీకి వస్తున్నాయన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం, సీఎం చంద్రబాబు కొనసాగితే ఏపీ అభివృద్ధిలో దూసుకెళ్తుందని.. అలాంటి లీడర్ నాయకత్వాన్ని మళ్ళీ గెలిపించుకోవాలని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.

## ఈ నెల 15, 16 తేదీల్లో పునశ్చరణ తరగతులు

**విజయవాడ, (రాజధాని వార్తలు):** అల్లూరి సీతారామరాజు జిల్లా "చింతపల్లి"లో ఎం.పి.డి.ఒ కార్యాలయ హాల్‌లో సి.ఆర్.మీడియా అకాడమీ ఆధ్వర్యంలో తరగతులు నిర్వహణ. సి.ఆర్.మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్. సి.ఆర్.మీడియా అకాడమీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా గ్రామీణ విలేఖరులకు రెండు రోజుల పాటు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి ఎం.పి.డి.ఒ కార్యాలయ హాల్‌లో ఈ నెల 15, 16 తేదీల్లో ఈ తరగతులు చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన పాత్రికేయ ప్రముఖుల ద్వారా వివిధ అంశాలపై గ్రామీణ విలేఖరులకు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలి రోజు నవంబర్ 15 ఉదయం విశాఖపట్నం నుండి వెలువడే "లీడర్" దిన పత్రిక ఎడిటర్ రమణ మూర్తి "పరిశోధనాత్మక జర్నలిజం" అనే అంశంపై ప్రసంగిస్తారు. మధ్యాహ్నం తరగతుల్లో "క్రైం వార్తల్లో మెళుకువలు" అంశంపై ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ బాబీవర్ధన్ ప్రసంగిస్తారు. అనంతరం "భారత రాజ్యాంగం – పత్రికా చట్టాలు అంశంపై ఎం.శ్రీనివాస రెడ్డి ప్రసంగిస్తారు.

రెండవరోజు "గిరిజన చట్టాలు – రిపోర్టింగ్" అంశం పై సీనియర్ జర్నలిస్టు, కాలమిస్ట్ గంజివరపు శ్రీనివాస రావు ప్రసంగిస్తారు. అనంతరం "పత్రికా భాష" అంశం పై విశాలాంధ్ర ఎడిటర్ ఆర్.వి.రామారావు ప్రసంగిస్తారు. అనంతరం కృత్రిమ మేధ" (ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్) అంశంపై సీనియర్ జర్నలిస్ట్ విజయకుమార్ కుర్రా ప్రసంగిస్తారు. సీనియర్ జర్నలిస్ట్ డి. సోమసుందర్ "జర్నలిజం– నైతిక విలువలు" అంశంపై ప్రసంగిస్తారు. అనంతరం ముగింపు సమావేశం,పునశ్చరణ తరగతుల్లో పాల్గొన్న జర్నలిస్టులకు సర్టిఫికెట్లు పంపిణీ చేయడం జరుగుతుంది.

## సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును స్థాపించాల్సిన సమయం ఆసన్నమైంది : పవన్ కల్యాణ్



**అమరావతి, (రాజధాని వార్తలు):** సనాతర ధర్మ పరిరక్షణపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సనాతర ధర్మ పరిరక్షణ కోసం ఓ ప్రత్యేక బోర్డు అవసరమని పవన్ కళ్యాణ్ సూచించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ పెట్టారు డిప్యూటీ సీఎం. ప్రపంచ వ్యాప్తంగా హిందూ సమాజానికి, తిరుమల తిరుపతి దేవస్థానం ఒక తీర్థయాత్ర కేంద్రం కంటే ఎక్కువ అని అభివర్ణించారు. తిరుపతి లడ్డూ కేవలం తీపి కాదని.. ఇది ఒక ఉమ్మడి భావోద్వేగమని ఉద్ఘాటించారు. తిరుపతి లడ్డూని అప్యాయంగా స్నేహితులు, కుటుంబ సభ్యులకు పంపిణీ చేస్తామని చెప్పుకొచ్చారు. తిరుపతి లడ్డూని ఇలా అందజేయడం వల్ల హిందువుల సమష్టి విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని ఉద్ఘాటించారు. ప్రతి సంవత్సరం దాదాపు 2.5 కోట్ల మంది భక్తులు తిరుమలను సందర్శిస్తారని నొక్కి చెప్పారు. సనాతన భావాలు, ఆచారాలు ఎగతాళి చేస్తే తనకు ఎంతో ఆవేదన కలిగిందని పేర్కొన్నారు. లౌకికతత్వం రెండు వైపులా ఉండాలని సూచించారు. హిందువుల విశ్వాసంపై రక్షణ, గౌరవంపై చర్చించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సనాతన ధర్మం అత్యంత పురాతనమైనదని ఉద్ఘాటించారు. నిరంతరం అభివృద్ధి చెందుతున్న నాగరికతలలో సనాతన ధర్మం ఒకటని అభివర్ణించారు. హిందువుల కోసం సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును స్థాపించాల్సిన సమయం ఆసన్నమైందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## నేషనల్ క్యాడెట్ కార్ప్స్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఐడియా & ఇన్నోవేషన్ పోటీ 2025

**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, విజయవాడలో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక ఆల్ ఇండియా ఐడియా & ఇన్నోవేషన్ పోటీ 2025 రెండో రోజు ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రముఖ పరిశ్రమ నిపుణులు, స్టార్టప్ మెంటార్లు, విద్యా సంస్థల నాయకులు.. క్యాడెట్లతో అమూల్యమైన విషయాల్ని, ఆలోచనల్ని పంచుకుని, జాతీయ ప్రగతికి ఆవిష్కరణలను సాధనంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఏక్స్‌పా మెంటార్ల ఆధ్వర్యంలో జరిగిన పరస్పర చర్చల్లో మొత్తం 91 మంది క్యాడెట్లు చురుకుగా పాల్గొన్నారు.

ఈ చర్చలు సృజనాత్మక సమస్య పరిష్కారాలు, స్థిరమైన సాంకేతిక పరిష్కారాలు, ప్రోటోటైప్ అభి వృద్ధి వంటి అంశాలపై దృష్టి సారించాయి. ఈ సెషన్‌లో పాల్గొన్న వారికి సృజనాత్మక భావనలను ఆచరణాత్మక పరిష్కారాలుగా ఎలా మలుచుకోవచ్చో అనుభవపూర్వకంగా తెలిసింది. తరువాత డైరెక్టరేట్ టీమ్‌ల ప్రెజెంటేషన్ క్రమం నిర్ణయించేందుకు లాటరీ డ్రా జరిగింది. అనంతరం రెండు డైరెక్టరేట్‌లు తమ ఆవిష్కరణా త్మక ప్రాజెక్టులను ప్రతిష్ఠాత్మక జ్యూరీ ప్యానెల్ ముందు ప్రదర్శిం చారు. ఈ ప్రాజెక్టులు భారత్ అభివృద్ధి లక్ష్యాలైన సుస్థితర, డిజిటల్ మార్పులు, గ్రామీణ సాధికారత, సాంకేతిక స్వావలంబన వంటి అంశాలకు అనుగుణంగా రూపొందించారు.

ఈ కార్యక్రమం ఎన్‌సిసి యువ ఆవిష్కర్తలకు వికసిత భారత్ @ 2047 స్వావలంబన, సాంకేతికంగా శక్తివంతమైన భారతదేశ దృష్టిని నిర్మించేందుకు తమ సృజనాత్మకతను మార్గనిర్దేశం చేసే అద్భుత వేదికగా కొనసాగుతోందని అధికారులు, అతిథులు పేర్కొన్నారు.

## తిరుపతి లడ్డూ కల్తీ నెయ్యి కేసులో సిట్ దూకుడు..విచారణకు హాజరైన ధర్మారెడ్డి

**తిరుపతి, (రాజధాని వార్తలు):** తిరుపతి లడ్డూ కల్తీ నెయ్యి కేసులో సిట్ దూకుడు పెంచింది. ఈ నేపథ్యంలో టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని విచారణకు మంగళవారం పిలిచింది. సిట్ విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. కొన్ని గంటలుగా ధర్మారెడ్డిని సీబీఐ డీఐజీ విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈరోజు సాయంత్రం వరకు ధర్మారెడ్డిని విచారించనున్నారు సిట్ అధికారులు. మళ్లీ రేపు (బుధవారం) కూడా ధర్మారెడ్డిని విచారించే అవకాశాలు ఉన్నాయి. అయితే, సిట్ విచారణ నుంచి బయటకు వెళ్లారు ధర్మారెడ్డి. ఈ నేపథ్యంలోనే మీడియాతో మాట్లాడటానికి ఆయన వచ్చారు. ఆ సమయంలో ధర్మారెడ్డికి శ్రీవారి లడ్డూ ఇచ్చేందుకు ప్రయత్నించారు జనసేన నేత కిరణ్ రాయల్. అయితే, కిరణ్ రాయల్ శ్రీవారి లడ్డూని ధర్మారెడ్డికి ఇచ్చే ప్రయత్నం చేయగా లడ్డూ తీసుకోకుండా అక్కడ నుంచి ఆయన వెళ్లినట్లు సమాచారం.

**సుబ్బారెడ్డికి సీబీఐ అధికారుల నోటీసులు**

మరోవైపు.. కల్తీ నెయ్యి కేసులో విచారణకు హాజరు కావాలని టీటీడీ మాజీ చైర్మన్ సుబ్బా రెడ్డికి సీబీఐ అధికారులు నోటీసులు జారీ చేశారు.

ఈనెల 13వ తేదీన లేకపోతే 15వ తేదీన హాజరవు తానని సమాధానం ఇచ్చారు సుబ్బారెడ్డి. తాను లక్నోకు వెళుతున్నందున 15వ తేదీన విచారణకు హాజరవుతానని సుబ్బారెడ్డి సమాచారం ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

# తూర్పు రొంపిదొడ్లలో విపిఆర్ నేత్ర సేవలు

**- 203 మందికి కంటి పరీక్షలు చేసిన సిబ్బంది - మంగళవారం గణేశ్వరపురం పంచాయతీలో అందుబాటులో ఉండనున్న బస్సు**











**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఎంతో ఉన్నత ఆశయంలో, గొప్ప సంకల్పంతో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, విపిఆర్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలు ప్రారంభించిన విపిఆర్ నేత్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం తూర్పు రొంపిదొడ్ల పంచాయతీలో 203 మందికి ప్రజలకు సిబ్బంది కంటి పరీక్షలు చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్షలు చేయగా 99 మందికి అద్దాలు అవసరం అని తేల్చి అద్దాలు అందజేశారు. విపిఆర్ నేత్ర బస్సును మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గణేశ్వరపురం పంచా యతీలోని రామాలయం సమీపంలో ప్రజలకు అందుబాటులో ఉంచనున్నారు. కావున పంచాయతీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

# ఆదాయం ప్రైవేట్‌పరం... సంపద దోచుకునే వరం

**- కూటమి పాలనలో ప్రజా వనరుల దోపిడీ జోరుగా : జమ్మలమడక నాగమణి**




**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో సహజ వనరుల దోపిడీకి కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ ఆదాయాన్ని ప్రైవేట్ వ్యక్తుల జేబుల్లోకి మళ్లించే పక్కా ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆమె ఆరోపించారు. ఉచిత ఇసుక విధానం ఇప్పుడు కూటమి అనుచరులకు ఆదాయ వనరుగా మారిందన్నారు. ప్రజా హితంకన్నా ప్రైవేట్ లాభం కూటమి లక్ష్యంగా మారింద"ని వ్యాఖ్యానించారు. తిరుమల లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి ఘటనపై గళమెత్తిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఆయన స్వీయ నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ కల్తీ నెయ్యి వ్యాపారంపై నోరు మూసుకోవడమే సనాతన ధర్మమా అని ప్రశ్నించారు. ఇటీవల పవన్ కళ్యాణ్ పర్యటనతో శేషాచల అడవుల్లో విలువైన ఎర్రచందనపై ప్రభుత్వం కన్నేసిందా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయని ఆమె తెలిపారు. అటవీ ప్రాంతాల్లో రోడ్లు, విద్యుత్ లైన్లు యుద్ధ ప్రాతిపదికన వేస్తున్నారన్నారు. ఇది అభివృద్ధి కోసం కాదా? లేక దోపిడీకి మార్గం సుగమం చేయడానికా అని ఆమె ప్రశ్నించారు. కాకినాడ పోర్ట్ నుంచి అక్రమ రేషన్ బియ్యం ఎగుమతులపై గతంలో హంగామా చేసిన పవన్ కళ్యాణ్, ఆ మాఫియా కేంద్రం పిఠాపురం అని తెలిసినా ఎందుకు మౌనం వహిస్తున్నారని ఆమె విమర్శించారు. అలాగే, ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన మద్యం విక్రయాలు ఇప్పుడు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడంతో, ఎంఆర్పీకి మించి విక్రయాలు విస్తరిస్తున్నాయని తెలిపారు. ప్రజల సొత్తు కొందరి చేతుల్లోకి వెళ్లిపోతోందనీ, ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణం అని నాగమణి వ్యాఖ్యానించారు. బాపట్లలో టిడిపి ఎమ్మెల్యే అనుచరుడికి చెందిన కోల్డ్ స్టోరేజ్‌లో భారీగా గోమాంసం నిల్వలు లభించడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు బీజేపీతో కూటమి మరోవైపు గోమాంసం వ్యాపారం ఇది ఏ ధర్మం అని మండిపడ్డారు. చివరగా నాగమణి అన్నారు. విదేశాల్లో కరెన్సీ ప్రజలందరి చేతుల్లో సర్క్యులేట్ అవుతుంటే, మన రాష్ట్రంలో మాత్రం కొందరి చేతుల్లోనే నిలిచిపోతోందన్నారు. ప్రజా సంపదను ప్రైవేటు వ్యక్తుల దోపిడీకి అప్పగించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయంగా మారిందని నాగమణి ఆరోపించారు.

# మరణిస్తూ విద్యార్థులను కాపాడిన బస్సు డ్రైవర్

**- గుండెపోటుతో బస్ డ్రైవర్ మృతి**

**- డ్రైవర్ ఆకస్మిక మరణంతో జీర్ణించుకోలేక పోయిన విద్యార్థులు**



**అమలాపురం, (రాజధాని వార్తలు):** విద్యార్థులను బస్సులో కళాశాలకు తీసుకు వెళుతూ గుండెపోటు రావడంతో బస్సును మార్గమధ్యంలో నిలిపివేసి 50 మంది విద్యార్థుల ప్రాణాలు కాపాడి తనువు చాలించాడు ఓ కళాశాల బస్సు డ్రైవర్. రాజమండ్రి గైట్ ఇంజనీరింగ్ కళాశాల బస్ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆలమూరు మండలం మడికి గ్రామానికి చెందిన దెందుకూరి నారాయణరాజు (60) దినచర్యలో భాగంగా సోమవారం విద్యార్థు లను గైట్ ఇంజనీరింగ్ కళాశాలకు బస్సులో తరలిస్తుండగా మడికి 216ఏ జాతీయ రహదారిపై వెళుతూ ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. నారాయణ రాజుకు గుండెపోటు రావడంతో క్షణాల్లో బస్సు మధ్యలోనే ఆపి క్రిందకు దిగి జాతీయ రహదారి డివైడర్‌లో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు.

విద్యార్థులు గమనించి హైవే సేఫ్టీ పెట్రోలింగ్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు క్షణాల్లో చేరుకుని నారాయణ రాజును ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించే తరుణంలో ప్రాణాలను కోల్పోయాడు. డ్రైవర్ నారాయణరాజు చనిపోతూ 50 మంది విద్యార్థులను కాపాడంటూ స్థానికులు ప్రశంసించడంతో పాటు విచారం వ్యక్తం చేశారు. విద్యార్థులతో గౌరవంగా ఉండే డ్రైవర్ నారాయణరాజు వారి కళ్ళ ఎదుటే చనిపోవడంతో విద్యార్థులు జీర్ణించుకోలేకపోయారు.

# చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తాం : జిల్లా యస్.పి. అజిత వేజెండ్ల, ఐపియస్






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లా పోలీసు కార్యాలయం నందు నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంలో 134 ఫిర్యాదులు స్వీకరణ. వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫిర్యాదుదారులను మాట్లాడించి, వారికి తక్షణమే ఉపశమనం కలిగించే విధంగా తగిన చర్యలు తీసుకున్న జిల్లా యస్.పి. ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదు.. ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని ఆదేశాలు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, చట్టపరిధిలో పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా యస్.పి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో జిల్లా యస్.పి. స్వయంగా మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 134 ఫిర్యాదులు వచ్చాయి...వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని.. 1. వేదాయపాలెం పరిధికి చెందిన వ్యక్తిని నెల్లూరుకు చెందిన గోళ్ళ బెనర్జీఏహర్షవర్ధన్ అనే వ్యక్తి పది లక్షల రూపాయలు నగదు తీసుకొని బ్యాంకు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, ఉద్యోగం ఇప్పించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా వేదిస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు. 2. కావలి పరిధికి చెందినటువంటి మహిళను కలిగిరిలోని ఓ హాస్పిటల్‌లో పనిచేసి మానేసినట్లు, కలిగిరికి చెందిన వేణు అనే వ్యక్తి ప్రేమిస్తున్నానని చెప్పగా, ఒప్పుకోలేదని, మనసులో పెట్టుకొని, అసభ్యకరంగా నా ఫోటోలు ఇంస్టాగ్రామ్‌లో పెడుతూ వేధిస్తున్నాడని, వేణు మరియు అతనికి సహకరించిన వారిపై విచారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. 3. నెల్లూరు రూరల్ పరిధికి చెందిన దివ్యాంగురాలని మనుబోలుకు చెందిన తాళ్లూరు రమణయ్య అనే వ్యక్తి తన బలహీనతను ఆసరాగా చేసుకుని నమ్మించి, తన ఇంటికి తీసుకెళ్లి, పలు విధాలుగా వేధించినట్లు తన నుండి రక్షణ కల్పించాలని కోరారు. 4. కొండాపురం పరిధికి చెందిన మహిళను మరియు మరి కొంతమందిని, కొండాపురంకు చెందిన తప్పెట మాలకొండయ్య అనే వ్యక్తి పలు రకాల సబ్సిడీ లోన్లు ఇప్పిస్తానని నమ్మించి ఒక్కొక్కరు వద్ద 35000 నగదు తీసుకొని లోను ఇప్పించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడని, విచారించి న్యాయం చేయాలని కోరారు. 5. బుచ్చి పరిధికి చెందిన మహిళను తన భర్త అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తూ ఇంటింటి గెంటివేశారని విచారించిన న్యాయం చేయాలని అదే విధంగా నెల్లూరు రూరల్ పరిధికి చెందిన మహిళ పొదలకూరులో పెళ్లి చేసుకున్నట్లు, వివాహమైనప్పటినుండి భర్త, అత్తింటివారు వేధిస్తున్నట్లు, తన బంగారం కూడా తీసుకొని బ్యాంకులో కుదవ పెట్టినట్లు, ఇంటి నుండి వెళ్లిపోవాలని వేధిస్తున్నారని కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలని కోరారు.

6. దర్గామిట్ట పరిధికి చెందినటువంటి 70 సంవత్సరాల వృద్దురాలు మున్సిపల్ శాఖలో పని చేసి రిటైర్డ్ అయినట్లు, రిటైర్డ్ అనంతరం వచ్చినటువంటి మొత్తం నగదు తన పెద్ద కొడుకు శ్రీనివాసులు తీసుకుని, ఇప్పుడు పెన్షన్ డబ్బులకు కూడా ఇవ్వాలని వేధిస్తున్నట్లు అదేవిధంగా జలదంకి పరిధికి చెందినటువంటి వృద్ధ దంపతులను నాలుగో కుమారుడు వెంకటేశ్వర్లు తన పక్కింట్లో ఉంటూ తన జీవనాధారం కోసం ఇచ్చిన పొలాన్ని అమ్మి డబ్బులు ఇవ్వాలని, తన ఉన్న ఇంట్లో నుండి వెళ్లిపోవాలని వేధిస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు. 7. దర్గా మిట్ట పరిధికి చెందిన వ్యక్తి యొక్క భార్య ఇంటి నుండి వెళ్లిపోయినట్లు, సదరు విషయమై దర్గా మిట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు, తన భార్య ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా జిల్లా యస్.పి. అజిత వేజెండ్ల, ఐపియస్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా యస్.పి. అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సి.హెచ్.సౌజన్య, ఆత్మకూరు డిఎస్పీ వేణుగోపాల్ ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి పిసిఆర్ సిఐ భక్తవత్సల రెడ్డి, ఎస్‌బి-2 సిఐశ్రీనివాసరెడ్డి మరియు కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మారేడు దళములతో పూజలందుకున్న మహాదేవుడు



**మధురవాడ, (రాజధాని వార్తలు):** విశాఖపట్నం కొమ్మాది వైఎస్సార్ కాలనీలో వేంచేసియున్న శ్రీ పార్వతి సమేత పరమేశ్వరుని ఆలయంలో మూడవ సోమవారం వేకువజామున 4 గంటల నుంచి భక్తుల తాకిడి మొదలయ్యింది. భక్తులు తమ గోత్రనామాలతో మధ్యాహ్నం 12 గంటల వరుకు విశేషంగా పంచామృతాభిషేకాలు మరియు విశేషార్చనలు ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ గరిమెళ్ళ శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో ఋత్వికులు సంజీవ్ కుమార్ శర్మ, మనోహర్ సాయి శర్మ, అనిల్ కుమార్ శర్మ మరియు శివ భక్తుడు భార్గవ్ సహాయ సహకారాలతో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ మారేడు పత్రి పరమేశ్వరునికి చాలా ప్రీతి అని ఒక మారేడు దళంతో స్వామి వారిని పూజిస్తే మూడు జన్మాల్లో చేసిన పాపం హరిస్తారని ఆయన మాటల్లో వర్ణించారు. దానిని పురస్కరించుకొని సాయంత్రం ప్రదోషకాలంలో సహస్ర బిల్వార్చన చేసి విశేషంగా స్వామి వారికి పంచ హారతి మరియు నక్షత్ర హారతి ఇచ్చి భక్తులకు దర్శనం ఇవ్వడం జరిగిందని అధిక సంఖ్యలో భక్తులు మరియు ఆలయ సేవకులు పాల్గొని తరించినట్లు తెలిపారు.

# "మెట్టా ఆధ్వర్యంలో ఘనంగా కాకాణి జన్మదిన వేడుకలు"











**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముత్తుకూరు మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన మాజీ మంత్రి వర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి పుట్టినరోజు సంబరాలు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేసి, మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు. మహానేత వై.యస్.రాజశేఖర్ రెడ్డికి పూలమాల వేసి నివాళులర్పించిన ముత్తుకూరు వైయస్సార్సీపీ నాయకులు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి భారీ స్పందన. మెగా రక్తదాన శిబిరానికి భారీగా తరలివచ్చి, 504 యూనిట్లు రక్తదానం చేసిన ముత్తుకూరు మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాకాణి గోవర్ధన్ రెడ్డి అభిమానులు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించిన నాయకులు. అభిమానుల పుట్టిన రోజు శుభాకాంక్షల నినాదాలతో హోరెత్తిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం.

# అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పలు సమస్యల పరిష్కారం కోసం.. జిల్లా కేంద్రానికి వచ్చే అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో పాటు జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్వో విజయకుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాఅధికారులు పాల్గొన్నారు.

**ట్రాన్స్‌జెండర్లకు ధ్రువీకరణ పత్రాలు, గుర్తింపుకార్డులు పంపిణీ**

జిల్లా దివ్యాంగులు, వృద్ధులు, హిజ్రాల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సుమారు 30 మంది ట్రాన్స్‌జెండర్లకు కలెక్టర్ హిమాన్షు శుక్ల ధ్రువీకరణ పత్రాలను, గుర్తింపుకార్డులను పంపిణీ చేశారు. 2019 హిజ్రాల చట్టం ప్రకారం హిజ్రాలకు సమాజంలో గౌరవం కల్పించాలనే లక్ష్యంతో అధికారిక గుర్తింపు పత్రాలు, ఐడెంటిటి కార్డులను నేషనల్ పోర్టల్ ఫర్ ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ పోర్టల్ ద్వారా మంజూరు చేస్తున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మహ్మద్ అయూబ్ చెప్పారు. ఈ సర్టిఫికెట్ల ద్వారా వికలాంగుల తరహాలో హిజ్రాలకు కూడా రూ.6 వేలు పింఛన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు. అలాగే నకిలీ హిజ్రాలను గుర్తించవచ్చన్నారు. దేశంలో ఎక్కడైనా ఈ గుర్తింపు కార్డు ఉపయోగపడుతుందన్నారు.

**దివ్యాంగుల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకున్న కలెక్టర్**

జిల్లా కలెక్టరు కార్యాలయానికి సమస్యలు చెప్పుకునేందుకు విచ్చేసిన పలువురు దివ్యాంగుల వద్దకే కలెక్టర్ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు.

వికలాంగుల సంక్షేమ సంఘం పేరుతో జిల్లాకు సంబంధం లేని ఒక వ్యక్తి విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారు లను పలురకాలుగా వేధిస్తున్నారని, వికలాంగులను చిన్నచూపు చూస్తున్నారని దివ్యాంగులు కలెక్టరుకు విన్నవించారు. స్పందించిన కలెక్టరు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# తుపానుకు దెబ్బతిన్న చేనేత కార్మికుల కుటుంబాలకు సాయం

## - మార్లగుంట, మోపూరు క్రాస్ రోడ్డులో నిత్యావసరాల పంపిణీ



**డక్కిలి, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న చేనేత కార్మికుల కుటుంబాలకు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశామని తహసీల్దార్ ఎం శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల మొంథా తుఫాను కారణంగా మగ్గం గుంటల్లోకి చేరిన వరద నీరు వారి రోజువారీ జీవనోపాధినే దెబ్బతీసింది. నెల రోజులుగా పనిలేక ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబాలకు ప్రభుత్వం నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేసింది. సోమవారం మార్లగుంట, మోపూరు క్రాస్ రోడ్డులో నివసిస్తున్న చేనేత కార్మికులకు తుపాను సాయం కింద నిత్యావసర సరుకులను పంపిణీ చేసినట్లు తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. "తుఫాను తీవ్రత చేనేత రంగంపై భారీగా పడింది. మగ్గం గుంతలలో నీరు చేరి పని పూర్తిగా ఆగిపోయింది" అని ఆయన పేర్కొన్నారు. చేనేత కార్మికుల పరిస్థితిని స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే సహాయక చర్యలు ప్రారంభమైనట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 50 కిలోల బియ్యం, కందిపప్పు, చక్కెర, బంగాళాదుంపలు, నూనె ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ సహాయాన్ని డక్కలి మాజీ జడ్పీసీ సభ్యులు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, డక్కలి పట్టణ టీడీపీ అధ్యక్షుడు డక్కలి చంద్రారెడ్డి బాధితులకు అందజేశారు. డక్కలి మండలంలోని మార్లగుంట, మోపూరు క్రాస్ రోడ్డు ప్రాంతాల్లో 152 కుటుంబాలకు ఈ నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీలర్స్ సంఘం అధ్యక్షుడు ప్రసాద్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు. తుఫాను ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు అందించిన ఈ సాయం తాత్కాలికంగా ఉపశమనం కలిగించింది.

# బ్లడ్ క్యాంపును విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

## - రక్తదానం చేసిన 504 మంది




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని నెల్లూరు డైకాస్ రోడ్డు సమీపంలోని క్యాంపు కార్యాలయంలో ముత్తుకూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో దువ్వూరు కృష్ణ తేజ రెడ్డి, సీపారెడ్డి జానకిరామ్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు నోవా బ్లడ్ బ్యాంకు మోపూరు భాస్కర్ నాయుడు తెలిపారు. కాకాని నివాసం వద్ద సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుమారు 504 మంది రక్తదానం చేశారని వివరించారు. యువత నుంచి పెద్ద ఎత్తున ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్నారన్నారు. రక్తదాన ఉద్యమంలో యువత ప్రాధాన్యతను గుర్తు ఉంచుకొని ఈ క్యాంపును ఏర్పాటు చేయటం ఎంతో ఆనందదాయకమన్నారు. తమకు అవకాశం కల్పించిన నిర్వాహకులకు ధన్యవా దాలు తెలిపారు. ఈ సమావేశంలో దూడల సుధీర్, బావిశెట్టి వెంకట కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ మార్గదర్శకాలను అనుసరించి హ్యాండ్ వాష్‌పై ప్రత్యేక కార్యక్రమం




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్ -4 ఆధ్వర్యంలో ఎర్రగుంట గ్రామంలో ప్రత్యేక శిబిరం మూడవరోజు పూర్తి చేసుకుంది. మూడవ రోజు ప్రత్యేక శిబిరంలో భాగంగా ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు ఎర్రగుంట గ్రామంలో ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించే అంశాలను మరియు పోషకాహార పదార్థాలు వాటి ద్వారా లభించే అటువంటి ఆరోగ్య ప్రయోజనాలను పప్పు దినుసులు ద్వారా డెమో రూపంలో విద్యార్థులకు తెలియపరచడం జరిగింది. అనంతరం మధ్యాహ్నం వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ మార్గదర్శకాలను అనుసరించి హ్యాండ్ వాష్‌పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి పరిశుభ్రంగా చేతులను ఎలాంటి పద్ధతిలో కడుక్కోవాలో డెమో రూపంలో విద్యార్థులకు చూపించడం జరిగింది. అనంతరం విద్యార్థులకు ఫిజికల్ ఫిట్నెస్‌ని బలోపేతం చేసేటువంటి ఆటలను నిర్వహించారు. ప్రత్యేక శిబిరంలో భాగంగా రేపు జరగబోవు ఉచిత వైద్య శిబిరాన్ని ఎర్రగుంట గ్రామ ప్రజలందరూ సద్వినియోగపరుచుకోవాలని వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి తెలియపరచడం జరిగింది. రెండో రోజు శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ వల్లపు మునిస్వామి సందర్శించి ఇక్కడ చేస్తున్న కార్యక్రమాలను చూసి వారు ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లును అభినందించారు. ఈ ప్రత్యేక శిబిరానికి సమన్వయకర్తగా ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి వెంకటసుబ్బారెడ్డి వ్యవహరించారు. ఈ శిబిరంలో కెమిస్ట్రీ విభాగం ఎం.బీ.ఏ విభాగం, విభాగం మరియు సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులో అరెస్ట్ కాబడి నెల్లూరు జైల్లో ఉన్న ఎన్ఆర్ఐ మాలపాటి భాస్కర్ రెడ్డిని

## ఆలూరి సాంబశివారెడ్డితో కలిసి పరామర్శించిన పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సోషల్ మీడియా కేసుతో నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్న లండన్‌లోని ప్రముఖ వ్యాపారి మాలపాటి భాస్కర్ రెడ్డితో వైసీపీ రాష్ట్ర అనుబంధ సంఘాల అధ్యక్షులు ఆలూరి సాంబశివారెడ్డితో కలిసి, వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా అధైర్య పడవద్దని పార్టీ అండగా ఉంటుందని భాస్కర్ రెడ్డికి వారు సూచించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం నియంతృత్వ పోకడలను అవలంబిస్తూ.. సామాన్య ప్రజలను కూడా భయభ్రాంతులకు గురి చేస్తుందని అన్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారన్న కారణంగా.. వారం రోజుల కిందట తన తండ్రి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చిన భాస్కర్ రెడ్డిని అన్యాయంగా అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఈ ఘటన కూటమి ప్రభుత్వ పరాకాష్టకు నిదర్శనమన్నారు. ప్రజలు ఎక్కడైనా ఏదైనా మాట్లాడాలన్న కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలు దుర్మార్గాలను ప్రశ్నించాలనుకున్న వారిని టార్గెట్ చేసి వారిని భయభ్రాంతులకు గురి చేయడం అక్రమ అరెస్టులకు పాల్పడడం..కూటమి నేతలకు పరిపాటిగా మారిందన్నారు. ప్రజాస్వామ్యంలో ఈవిధమైన వింత పోకడలు సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న అక్రమ అరెస్టులకు ప్రజలే ఆ పార్టీ నేతలకు బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. అనంతరం జైలు వద్దకు విచ్చేసిన మాజీ మంత్రి జోగి రమేష్ సతీమణిని, జోగి రమేష్ కుమారుడిని చంద్రశేఖర్ రెడ్డి కలుసుకొని మాట్లాడారు. జోగి రమేష్‌పై కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసు నిలవదని జోగి రమేష్ తప్పకుండా నిర్దోషిగా ఈ కేసు నుంచి బయట పడతారని ధైర్యంగా ఉండాలని సూచించారు.

# అట్టహాసంగా చంద్రన్న విద్యుత్ వెలుగులు కార్యక్రమం ప్రారంభోత్సవం

## - స్థానిక రైతు మట్టెపు రమణయ్య యాదవ్ చేత ప్రారంభించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 1వ డివిజన్, కోడూరుపాడు ఎస్.టి. కాలనీలో స్థానిక రైతు మట్టెపు రమణయ్య యాదవ్ చేత ప్రారంభించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఐఏఎస్. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎమ్. వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ మరియు కోడూరు కమలాకర్ రెడ్డి. భగత్ సింగ్ కాలనీ తరహాలో కోడూరుపాడు ఎస్.టి. కాలనీలో గిరిజనుల పట్టాల కోసం స్థానిక శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డితో కలసి కృషి చేస్తా.

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఐఏఎస్. ఎన్నికలు లేనివేళ అభివృద్ధి కార్యక్రమాల సాధన మరియు ప్రజా సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తా. రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి. మొత్తం 26 ప్రాంతాలలో 3 ఫేజ్ కరెంటు పనులు జరిగాయి. వాటిలో 17 ప్రాంతాలలో పనులు పూర్తి స్థాయిలో పూర్తయ్యాయి. ఈ రోజు 17 ప్రాంతాలలో ఒకే సమ యానికి ఎక్కడికక్కడ స్థానిక రైతుల చేత కూటమి స్థానిక నాయకులు ప్రారంభింపచేసారు. మిగిలిన 9 ప్రాంతాలలో పనులు పూర్తయి, ఛార్జింగ్ దశలో ఉన్నాయి. వాటిని కూడా త్వరలో ప్రారంభిస్తాం. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహకారం అందించండి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఐఏఎస్‌ని కోరిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జానా నాగరాజు గౌడ్, క్లస్టర్ ఇంచార్జ్ కుడుముల చిరంజీవి, కో క్లస్టర్ ఇంచార్జ్ తమ్మి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## గూగుల్ హబ్‌తో గ్లోబల్ మ్యాప్‌పై విశాఖ!

విశాఖపట్నంలో ఒక గిగావాట్ సామర్థ్యంతో దేశంలో తొలి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా హబ్‌ను స్థాపించడానికి 15 బిలియన్ డాలర్ల పెట్టుబడిని ప్రకటించిన తరుణంలో సర్వత్రా హర్షాతిరేకాలతోపాటు కొన్ని సహజమైన సందేహాలు వ్యక్తమయ్యాయి. ఇంతటి భారీ సౌకర్యం స్థానిక పవర్ గ్రిడ్‌పై భారం మోపదా? నీటి వనరులను హరించివేయదా? అసలు ఈ స్థాయి పెట్టుబడికి తగినన్ని ఉద్యోగాలను సృష్టించగలదా? వంటి ప్రశ్నలు సామాన్యులలోనూ నిపుణులలోనూ రేకెత్తాయి. కానీ వాస్తవాలను, సాంకేతిక అంశాలను, అంతర్జాతీయ నమూనాలను నిశితంగా పరిశీలిస్తే ఈ ఏఐ హబ్ ఒక భారం కాదనీ భవిష్యత్ తరాలకు మార్గనిర్దేశం చేసే ఒక సుస్థిర ప్రగతి నమూనా అనీ స్పష్టమవుతుంది. అందరి మదిలో మెదిలే తొలి ప్రశ్న విద్యుత్. కానీ ఈ ప్రాజెక్టు రూపకల్పనే 'స్వయం సమృద్ధి' లక్ష్యంగా జరిగింది. గూగూల్ సంస్థ ఈ హబ్ కోసం అవసరమైన విద్యుత్‌లో 80శాతాన్ని సహజ ఇంధన వనరుల ద్వారా సమకూర్చుకోనున్నది. దీనికోసం ప్రత్యేకంగా ఒక గిగావాట్ సామర్థ్యంతో ఒక సోలార్ పార్క్‌ను నిర్మిస్తోంది. ఇది మామూలు విషయం కాదు. ప్రజల అవసరాలకోసం ఉద్దేశించిన గ్రిడ్‌పై భారం మోపకుండా, ఒక పారిశ్రామిక దిగ్గజం తన సొంత హరిత ఇంధన వనరులను సృష్టించుకోవడం ఇదే ప్రప్రథమం. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ గ్రిడ్‌పై ఈ ప్రాజెక్టు కారణంగా పడే భారం సున్న! ఇక సాంకేతిక సామర్థ్యం విషయానికి వస్తే గూగుల్ డేటా సెంటర్లు అద్భుతమైన పనితీరుకు మారుపేరు. విద్యుత్ వినియోగ సామర్థ్యానికి కొలమానమైన 'పవర్ యూసేజ్ ఎఫెక్టివ్‌నెస్' (పీయూఈ) గూగుల్ సెంటర్లలో సగటున 1.10శాతం. అంటే కంప్యూటింగ్ శక్తికి 10శాతం మాత్రమే అదనపు విద్యుత్ అవసరం. అదే సగటు పరిశ్రమ పీయూఈ 1.58గా ఉంది. అంటే అక్కడ కంప్యూటింగ్‌కు వాడినంత శక్తిలో 58శాతం అదనంగా వృథా అవుతోందన్నమాట. గూగుల్ సాంకేతికత ఎంత శక్తిని ఆదా చేస్తుందో, ఎంత పర్యావరణ భారాన్ని తగ్గిస్తోందో దీనినిబట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ 1 గిగావాట్ సోలార్ పార్క్ డేటా సెంటర్‌కు మాత్రమే కాదు. రాష్ట్ర రెన్యూవబుల్ ఎనర్జీ లక్ష్యాలకు కూడా భారీ ఊతం ఇస్తున్నది. పారిశ్రామిక ప్రగతి, పర్యావరణ బాధ్యత కలిసే సాగగలవని నిరూపిస్తోంది. నీటి వినియోగంపై కూడా ఆందోళనలు సహజం. కానీ వాస్తవ గణాంకాలను పరిశీలిస్తే ఈ భయాలు నిరాధరమైనవని అర్థమవుతుంది. ఉదాహరణకు విశాఖ ఉక్కు కర్మాగారం రోజువారీ నీటి వినియోగం సుమారు 38 మిలియన్ గ్యాలన్‌లు (ఎంజీడీ). దీనితో పోల్చినప్పుడు, ఈ భారీ ఒక గిగావాట్ డేటా సెంటర్ మొత్తం వినియోగ అంచనా కేవలం 5 ఎంజీడీ మాత్రమే. అంటే ఇది స్టీల్ ప్లాంట్ వాడకంలో 15 శాతం కంటే తక్కువ. ఇది కూడా గరిష్ఠ అంచనా మాత్రమే. అంతేకాకుండా విశాఖకు ఉన్న తీరప్రాంతం ఒక సహజవరంగా ఉపయోగపడనున్నది. ఈ ప్రాజెక్టులో మంచినీటి వాడకాన్ని దాదాపు సున్నాకు తగ్గించే సాంకేతికత అందుబాటులో ఉంది. ఆధునిక సముద్రపు నీటి ఆధారిత శీతలీకరణ వ్యవస్థ (సీ వాటర్ కూలింగ్)ను ఇక్కడ వినియోగిస్తారు. సముద్రపు నీటిని నేరుగా కాకుండా హీట్ ఎక్స్‌చేంజర్‌ల ద్వారా వేడిని చల్లార్చడానికి ఉపయోగిస్తారు. దీనివల్ల అమూల్యమైన మంచినీటి వనరులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. హైదరాబాద్ లేదా బెంగళూరు వంటి లోతట్టు నగరాలలో ఇలాంటి ప్రాజెక్టు వస్తే వారు ఖచ్చితంగా తాగునీటి వనరులపైనే ఆధారపడాల్సి వచ్చేది. కానీ విశాఖతీరం మనకు వ్యూహాత్మక ప్రయోజనాన్ని ఇచ్చింది. ఇవి క్లోజ్డ్ లూప్ వ్యవస్థలు, అంటే నీటిని ఒకసారివాడి వదిలేయకుండా దాన్నే శుద్ధి చేసి చల్లార్చి పదే పదే అంతర్గతంగా వినియోగిస్తారు. దీనివల్ల నీటి వృథాకు ఆస్కారం ఉండదు. ఇది స్థానిక జలవనరులపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపని ప్రణాళిక. కేవలం నిర్మాణ సమయంలోనే ఉద్యోగాలు లభిస్తాయనేది ఒక అపోహ మాత్రమే. అమెరికా డేటా సెంటర్ పరిశ్రమపై 2025 పీడబ్ల్యూసీ అధ్యయనం దీనికి సంబంధించిన వాస్తవాలను కళ్లకు కట్టేలా చూపింది. ఈ అధ్యయనం ప్రకారం ప్రత్యక్ష ఉపాధి 2017లో 4,00,100 నుంచి 2023 నాటికి 6,03,900 ఉద్యోగాలకు పెరిగింది. కానీ అసలు కథ ఇక్కడే ఉంది. పరోక్ష, ఉపాధిని కూడా కలిపితే ఈ పరిశ్రమ ద్వారా పొందిన ఉద్యోగాలు అదే కాలంలో 2.9 మిలియన్ల నుంచి 4.7 మిలియన్లకు పెరిగాయి. ఇది ఏడు రెట్ల ప్రభావాన్ని సూచిస్తుంది. ఈ లెక్కన విజన్ ఏఐ హబ్ ద్వారా లభించే 25వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు మొత్తం ఉపాధి వ్యవస్థపై చూపే ప్రభావం 2లక్షలకు పైమాటే. అతిముఖ్యమైన విషయం ఏమిటంటే... ఈ ఉద్యోగాలు తాత్కాలికం కావు. ఇక్కడ లభించే నైపుణ్యాలు (హైటెక్ నిర్మాణం, ఫైబర్ ఆప్టిక్స్, నెట్‌వర్క్ నిర్వహణ) కేవలం ఒక ప్రాజెక్టుకే పరిమితం కావు. ఇవి మొత్తం డిజిటల్ పరిశ్రమలకు అవసరం. 2030 నాటికి భారతదేశ డేటా సెంటర్ సామర్థ్యం 5-6 గిగా వాట్‌లకు చేరనుంది. ఈ దూకుడు గల పైప్‌లైన్‌కు, ఇక్కడ శిక్షణ పొందిన నిపుణులకు నిరంతరంగా జాతీయ డిమాండ్ ఉంటుంది. ఇక ఒక ప్రాజెక్టు కాదు. ఒక నైపుణ్యభరిత పారిశ్రామిక శక్తికి పునాది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన రూ.22వేల కోట్ల ప్రోత్సాహకాలను కొందరు ఉచితాలుగా తప్పుగా అన్వయించుకుంటున్నారు. ఇది ఉచితం కాదు. రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టిన వ్యూహాత్మక పెట్టుబడి. దీని ద్వారా రాబోయే ప్రతిఫలం అపారమైనది. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక అంచనాల ప్రకారమే ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్ర స్థూల జాతీయ ఉత్పత్తికి (జీఎస్‌డీపీ) ఏటా రూ.10,518 కోట్లు అదనంగా సమకూరనుంది. అంటే కొన్ని సంవత్సరాలలోనే ప్రోత్సాహకాల విలువ తిరిగి రాబడుతుంది.

# ఓడలరేవు రూపురేఖలు మార్చనున్న చంద్రబాబు

**- సీఎం చంద్రబాబు పర్యటనతో ఓడలరేవుకు మహర్దశ - రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు ఎన్ ఆర్జీ ఎస్ నిధులు రూ.3.58 కోట్లతో సిసి రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణం - ఓఎన్జిసి గేటు నుండి బీచ్ వరకు ఓఎన్జిసి నిధులు రూ.90 లక్షలతో సిసి రహదారి నిర్మాణం - వంతెన నుండి ఓఎన్జిసి గేట్ వరకు ఓఎన్జిసి నిధులు రూ 2.20 ఓట్లతో నిలిచిపోయిన సిసి రహదారి నిర్మాణం - పనులు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆదేశం**



**అల్లవరం, (రాజధాని వార్తలు):** నిర్లక్ష్యానికి గురై అభివృద్ధికి నోచుకోని ఆ గ్రామం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడుగు పెట్టడంతో ఒక్కసారిగా ఆ ఊరి రూపురేఖలు మారనున్నాయి. ఎక్కడో మారుమూల సముద్ర తీరాన ఉన్న ఆ గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటన ఆ ఊరికి మహర్దశ తెచ్చిపెట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చేనాటికి గ్రామంలో అద్వానంగా ఉన్న రహదారులు అభివృద్ధికి నోచుకోని తీరు ఆయన కంటపడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన అనంతరం గ్రామంలో సిసి రహదారులు, డ్రైన్ సౌకర్యం తదితర అభివృద్ధి పనులు శరవేగంగా సాగేందుకు అడుగులు ముందుకు సాగుతున్నాయి. ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ ప్రభావానికి గురైన అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత నెల 29వ తేదీన పర్యటించారు. గ్రామ పర్యటన సందర్భంగా దెబ్బతిన్న రహదారులను ముఖ్యమంత్రి కళ్లారా చూశారు. గ్రామంలో రహదారులు నిర్మించాలని అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామస్తులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా కలెక్ట ర్‌ను ఆదేశించారు. చంద్రబాబు పర్యటించిన మరుసటి రోజే అధికారులు గ్రామంలో పర్యటించి చేపట్ట వలసిన పనుల జాబితాను రూపొందించారు. సుమారు రూ. 10 కోట్ల రూపాయలతో చేపట్టవలసిన 34 పనులను గుర్తించారు. ఇందులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సోమవారం సంబంధిత అధికారులతో సమీక్షించి పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఇందులో భాగంగా మొదటి విడతలో సుమారు 6 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు మార్గం సుగమమైంది. మరిడమ్మ సెంటర్ నుండి ఫెర్రీ రేవు వరకు ఎన్ ఆర్ జీఎస్ నిధులు రూ. 3.58 కోట్లతో ప్రతిపాదించిన 8 పనులు చేపట్టేం దుకు జిల్లా కలెక్టర్ మంజూరు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో మరిడమ్మ సెంటర్ నుండి ఫెర్రీ రేవు వరకు, పలు ప్రాంతాలలో కలిపి 2400 మీటర్ల సిసి రహదారులు, 2000 మీటర్ల డ్రైన్‌లు నిర్మించనున్నారు. అలాగే అలాగే ఓఎన్జిసి గేటు నుండి బీచ్ వరకు 900 మీటర్లు ఓఎన్జిసి నిధులు రూ.96 లక్షలతో సిసి రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. ఓఎన్జిసి నిధులు రూ.7.62 కోట్లతో (విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్‌తో కలిపి) బెండమూర్లంక నుండి ఓఎన్జిసి గేట్ వరకు 7 మీటర్ల వెడల్పుతో సిసిఆర్ రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉండగా ఓడలరేవు పంచనది వంతెన వరకు రెండు కిలోమీటర్ల మేర రహదార నిర్మాణం పూర్తి చేశారు. పంచ నది వంతెన నుండి ఓఎన్జిసి టెర్మినల్ వరకు 1.25 కిలోమీటర్ల రహదారి నిర్మాణం నిలిచిపోయింది. ముఖ్యమంత్రి పర్యటన అనంతరం నిలిచిపోయిన 1.25 కిలోమీటర్ల రహదారిని వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మరిడమ్మ సెంటర్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైన్ నిర్మాణం తదితర అదనపు వ్యయం రూ.1.45 కోట్లుగా అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. కలెక్టర్ నిధులు మంజూరు చేయడంతో ఓడలరేవులో అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి. కలెక్టర్ ఆదేశాలతో పంచాయతీరాజ్ ఈఈ రామకృష్ణారెడ్డి, ఏపీఈపీడీసీఎల్ ఎస్ ఇ రాజేశ్వరి, డిఈ అన్యం రాంబాబు, ఓఎన్జిసి అధికారి సంజయ్, ఎంపీడీవో గౌరీ కుమారి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు దెందుకూరు సత్యనారాయణ రాజు ఓడలరేవులో పర్యటించి చేపట్టవలసిన రహదారి నిర్మాణం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మల్లాడి ఉమామహేశ్వరరావు, కొల్లు విష్ణుమూర్తి, పినపోతు రామకృష్ణ, పెచ్చెట్టి రామకృష్ణ, చొల్లంగి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కరప పీహెచ్సీలో గర్భిణీ స్త్రీల వైద్య శిబిరం

**- గర్భిణీల ఆరోగ్య రక్షణలో భాగంగా వైద్యులు పలు సూచనలు**





**కరప, (రాజధాని వార్తలు):** మండల కేంద్రం కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధా నమంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ కార్యక్రమం కింద ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు సమగ్ర వైద్య పారిశుద్ధ్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీల ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. ఈ శిబిరాన్ని డాక్టర్ ఏంజెలన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా, గైనకాలజిస్టులు డా.శ్రావణి సాక్షి (మెడికవర్), డా.అలీనా సుభాని (జీజిహెచ్) పాల్గొన్నారు. గర్భిణీల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించడంతో పాటు ప్రసవానికి ముందు జాగ్రత్తలు, పోషకాహార ప్రాముఖ్యతపై విపులంగా వివరించారు. శిబిరంలో డాక్టర్లు మాట్లాడుతూ ప్రతి నెల 9వ తేదీ 'ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ దినోత్సవం'గా రాష్ట్రవ్యాప్తంగా జరుపుకుంటారని, ఆ రోజు ప్రతి గర్భిణీ స్త్రీ తప్పక పీహెచ్సీకి వచ్చి పూర్తి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గర్భధారణ ప్రారంభమైన తొలి నెలలో మొదటి నెల (టిటి టీకా) వేయించుకోవాలని, రెండవ నెలలో రెండో టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని తెలిపారు. రెండవ నెల నుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి రక్తపోటు, బరువు, చక్కెర స్థాయిలు వంటి పరీక్షలు చేయించుకోవడాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. డా.అలీనా సుభాని మాట్లాడుతూ మూడవ నెలలో కొన్ని గర్భిణీలకు గర్భజలం (ఉమ్మనీరు) అధికమవడం, లేదా లీక్ అవ్వడం వంటి పరిస్థితులు ఎదురవుతాయని, అలాంటప్పుడు భయపడకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అదేవిధంగా గర్భిణీలు ఐరన్ మాత్రలు, ఫోలిక్ యాసిడ్ మాత్రలను నిర్లక్ష్యం చేయకుండా తీసుకోవాలని సూచించారు. శిబిరంలో సిబ్బంది గర్భిణీలకు ఉచిత రక్త పరీక్షలు, యూరిన్ టెస్టులు, బరువు, హెమోగ్లోబిన్ స్థాయిలు, రక్తపోటు కొలతలు నిర్వహించారు. వారి ఆహారపు అలవాట్లు, జీవనశైలిపై వ్యక్తిగతంగా సూచనలు అందించారు. పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించి, శాకాహారం, పండ్లు, ఆకుకూరలు, గుడ్లు, పాల ఉత్పత్తులను ఆహారంలో తప్పనిసరిగా చేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు పండ్ల పంపిణీ. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాదే ఆశా జ్యోతి కుమార్ మాట్లాడుతూ ప్రతి గర్భిణీ ఆరోగ్య సంరక్షణలో భాగస్వామి కావడం సమాజ బాధ్యతని తెలిపారు. గ్రామస్థులు కూడా ఇలాంటి వైద్య శిబిరాల్లో పాల్గొని ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలిశెట్టి తాతీలు, నక్కా భద్రం, మంచాల శ్రీనివాస్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# ఏపీ పంచాయతీ రాజ్ ఇంజనీర్స్ కోనసీమ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక




**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పంచాయతీరాజ్ గ్రాడ్యుయేట్ ఇంజనీర్స్ జిల్లా కార్యవర్గ సర్వసభ్య సమావేశం స్థానిక అమలాపురం పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్‌లో సోమవారం నిర్వహించారు. 2025-2028 సంవత్సరానికి నూతన కార్యావర్గాన్ని ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రాధాకృష్ణ, జనరల్ సెక్రెటరీగా బి.దుర్గ కొండలరావు, వైస్ ప్రెసిడెంట్‌గా చంద్రశేఖర్, పి సుజాత, పి సత్య నారాయణ, ఫైనాన్స్ సెక్రటరీ, ఆర్గనైజ్ సెక్రటరీ లుగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికార ఇరిగేషన్ ఏఈఈ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రగతికి పాటు పడాలని ఈఈ పులి రామకృష్ణ రెడ్డి ఉన్నారు. నూతన కార్యవర్గ సభ్యులు సమస్యలను రాష్ట్ర కార్యవర్గం దృష్టిలో పెట్టి పరిష్కారం చూపాలని అన్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు ఏపీ పీఆర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రటరీ అన్యం రాంబాబు, డిప్యూటీ ఈఈ పిఎస్ రాజకుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

# మరిడమ్మ ఆలయంలో అనకాపల్లి జిల్లా భక్తులు పూజలు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం గ్రామ దేవత అయిన శ్రీ మరిడమ్మ అమ్మవారి ఆలయంలో అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలోవిచ్చేసి సోమవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణ అధికారిణి, దేవాదాయ సహాయ కమిషనర్ కె విజయ లక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. కార్తీక మాస పర్వదినాల్లో భాగంగా వాళ్ళ ఆలయాల సందర్శనలో భాగంగా మరిడమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చినట్టు భక్తులు చెప్పారు. కాగా ఆలయ అధికారులు దగ్గరుండి వారికి ప్రత్యేక దర్శనాన్ని అందజేసి అన్న ప్రసాదాలను అన్న ప్రసాదాలను, అమ్మవారి రూపులను అందించి పండిత ఆశీర్వచనాలతో పంపించారు. కాగా కార్తీకమాస పర్వదినాల సందర్భంగా ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి రాగా ఆలయ అధికారిణి విజయలక్ష్మి ఆధ్వర్యంలో వారికి ప్రచార ప్రత్యేక ప్రసాదాలు అందజేశారు.


# స్వదేశీ ఉత్పతులను వాడుదాం...బీజేపీ నేతల ప్రచారం





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మన దేశంలో ఉత్పత్తి అయో వస్తువులను అందరు ఉపయోగిస్తే దేశంలో అందరికి మెరుగైన ఉపాధి లభిస్తుందని దేశియ్య ఉత్పత్తి కూడా పెరుగుతుందని అన్నారు. బీజేపీ నేతలు కందికట్ల రాజేశ్వరి పీ.సురేంద్ర రెడ్డిలు సోమవారం ప్రవాస్ యోజన ప్రోగ్రాంలో భాగంగా నెల్లూరు నగరంలోని బాలాజీ నగర్ మండలంలో జరిగిన మండలపార్టీ సమావేశంకు హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు స్వదేశీ వస్తువులను అందరు ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. స్వదేశీ ఉత్పత్తుల గురించి ఇంటింటికి తెలియజేస్తూ కరపత్రాలు పంపిణి చేసి గోడలపై స్టిక్కర్లను అంటించారు. స్థానిక సత్య సాయి స్కూల్లో వందే మాతరం పుట్టి 150 సంవత్సరాలు అయిన సందర్భంగా స్కూల్లో విద్యార్థులతో కలసి వందే మాతర గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ నగర్ మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు మింగా కిరణ్ ప్రధాన కార్యదర్శి సురేష్ శరత్ ఎస్సీ మోర్చా నాయకులు డి బాలకృష్ణ మండల కార్యదర్శి చేతన్ రెడ్డి మండల యువమోర్చా నాయకులు రాజేష్ బిజెపి జిల్లా కార్యదర్శి జివిటి ప్రభాకర్ మండల ప్రధాన కార్యదర్శి మహేష్ బాబు పాల్గొన్నారు.

# దుల్కర్ కొత్త మూవీ.. ఇదేం ట్విస్ట్?



మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్.. వరుస సినిమాలతో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. అటు లీడ్ రోల్స్ లో నటిస్తూ.. ఇటు ప్రొడ్యూసర్ గా సినిమాలను నిర్మిస్తున్నారు. అదే సమయంలో తెలుగు స్ట్రయిట్ మూవీలు చేస్తూ సూపర్ హిట్స్ అందుకుంటున్నారు. ఇప్పుడు కాంత మూవీతో త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. పీరియాడికల్ డ్రామాగా రూపొందుతున్న ఆ సినిమా.. 1950 టైంలో మద్రాస్ ఇండస్ట్రీలో పరిస్థితులు, ఓ హీరో, ఓ డైరెక్టర్ మధ్య జరిగిన వివాదాల చుట్టూ తిరగనుంది. మూవీలో దుల్కర్ సినీ హీరోగా కనిపించనుండగా.. సముద్రఖని డైరెక్టర్‌గా సందడి చేయనున్నారు. కీలక పాత్రలో హీరో రానా యాక్ట్ చేస్తున్నారు. దుల్కర్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా యాక్ట్ చేస్తుండగా.. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, వేఫెరర్ ఫిల్మ్స్ లిమిటెడ్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్, ప్రశాంత్ పొట్లూరి గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. నవంబర్ 14న వరల్డ్ వైడ్‌గా విడుదల చేయనున్నారు. అయితే ఆడియన్స్‌లో కాంత మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. టీజర్, ట్రైలర్, సాంగ్స్ అన్నీ సూపర్ రెస్పాన్స్ సంపాదించుకున్నాయి. అయితే ఇప్పుడు మరో మూడు రోజుల్లో మూవీ విడుదల కానుండగా.. ఓ సీనియర్ అండ్ లెజెండరీ హీరో బయోపిక్‌గా కాంత తెరకెక్కినట్లు ఇప్పుడు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. కోలీవుడ్ లెజెండ్ ఎంకే త్యాగరాజన్ లైఫ్ ఆధారంగా సెల్వరాజ్ కథ రాసుకున్నారని తమిళ మీడియాలో వార్తలు తెగ చక్కర్లు కొడుతున్నాయి.

అందులో నిజమెంతో తెలియకపోయినా.. ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే త్యాగరాజన్.. స్టేజ్ సింగర్ గా కెరీర్ ను స్టార్ట్ చేశారు. ఆ తర్వాత స్టార్ హీరోగా ఎదిగారు. అదే సమయంలో ఓ మర్డర్ కేసులో వల్ల ఆయన జీవితం మలుపు తిరిగిందనే చెప్పాలి. ఆ ఉదంతంలో త్యాగరాజన్ నిర్దోషిగా బయటపడ్డారు. కానీ ఆ తర్వాత మళ్లీ ట్రాక్‌లోకి రాలేకపోయారు. అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు త్యాగరాజన్ జీవిత కథతో కాంత మూవీ రూపొందిందని ప్రచారం జరుగుతోంది. మరి అందులో నిజమెంతో తెలియాలంటే.. సినిమా థియేటర్స్‌లో రిలీజ్ అయిన వరకు వేచి చూడాల్సిందే.

# కాంతార రుక్మిణి మళ్ళీ ట్రెండింగ్.. ఎందుకంటే..?




కన్నడ భామ రుక్మిణి వసంత్‌కి లక్కు మామూలుగా లేదని చెప్పొచ్చు. ఎందుకంటే ప్రస్తుతం సౌత్‌లో కాదు కాదు నేషనల్ వైడ్‌గా అమ్మడు మరోసారి ట్రెండింగ్‌లో ఉంది. సప్త సాగరాలు దాటి సినిమాలో ప్రియ పాత్రలో ప్రేక్షకుల మనసులు దోచేసింది రుక్మిణి. ఆ సినిమాలో ఆమె క్లోజప్ షాట్స్‌ని చాలా పెద్ద ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆ సినిమాతో పాపులర్ అయిన రుక్మిణి తమిళంలో వరుస సినిమాలు చేస్తుంది. ఐతే రీసెంట్‌గా వచ్చిన కాంతారా చాప్టర్ 1 లో కనకావతి రోల్‌లో అదరగొట్టేసింది రుక్మిణి. కాంతారా చాప్టర్ 1 బ్లాక్ బస్టర్ హిట్ అవ్వడంలో రిషబ్ శెట్టి యాక్టింగ్ ఎంత ఇంప్రెస్ చేసింది కనకావతి రోల్‌లో రుక్మిణి వసంత్ కూడా అదే రేంజ్‌లో ఇంప్రెస్ చేసింది. రుక్మిణి వసంత్ ఫ్యాన్స్‌కి అయితే కాంతారాలో ఆమె లుక్స్ మైండ్‌లో నుంచి పోవట్లేదు అనే రేంజ్‌లో ఇంపాక్ట్ చూపించింది. కాంతారా 1 థియేట్రికల్ రన్ నడుస్తున్న రోజులు రుక్మిణి వసంత్ సోషల్ మీడియాని ఊపేసింది. సినిమాలో ఆమె లుక్స్ అయితే వర్ణించడానికి మాటల్లేవ్ అనేలా ఉన్నాయని డిస్కస్ చేశారు. ఇక ఇప్పుడు మళ్లీ కాంతారా చాప్టర్ 1లో రుక్మిణి రోల్ గురించి ఆమె లుక్స్ గురించి సోషల్ మీడియాలో మరోసారి హడావిడి చేస్తున్నారు. కాంతారా చాప్టర్ 1 సినిమా ఈమధ్యనే ఓటీటీ రిలీజైంది. అమెజాన్ ప్రైమ్‌లో సినిమా స్ట్రీమింగ్ అవుతుంది. ప్రైమ్ వీడియోస్‌లో రిలీజైన కాంతారా 1 మళ్లీ వార్తల్లో నిలుస్తుంది. రిషబ్ యాక్టింగ్ గురించి అతని టేకింగ్ అదే డైరెక్షన్ గురించి సూపర్ అనేస్తున్నారు ఆడియన్స్. ఇక అదే క్రమంలో హీరోయిన్ రుక్మిణి వసంత్ గురించి కూడా మళ్లీ ట్రెండింగ్ చేస్తున్నారు. కాంతారా 1లో రుక్మిణి తప్ప మరో హీరోయిన్‌ని ఊహించలేకపోతున్నాం అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఏది ఏమైనా రుక్మిణి వసంత్‌కి కాంతారా మంచి క్రేజ్ ఏర్పడేలా చేసింది. ఆమె మీద ఉన్న అంచనాలకు చేస్తున్న పాత్రలు తోడై అమ్మడికి విపరీతమైన ఫాలోయింగ్ తెస్తున్నాయి. ఐతే రుక్మిణి వసంత్ నెక్ట్స్ ఎన్టీఆర్ డ్రాగన్‌లో హీరోయిన్‌గా నటిస్తుంది. తెలుగులో స్ట్రైట్‌గా నిఖిల్‌తో ఒక సినిమా చేసింది రుక్మిణి. కానీ దాన్ని ఎవరు పట్టించుకోలేదు. కానీ కాంతారా 1 ఇచ్చిన క్రేజ్‌తో తప్పకుండా రుక్మిణి చేసే ప్రతి సినిమా మంచి స్కోప్ దొరికే ఛాన్స్ ఉంటుంది. కొందరైతే నేషనల్ క్రష్ ట్యాగ్‌ని రష్మిక నుంచి రుక్మిణికి ఇచ్చేయాలని కోరుతున్నారు. మరి ఈ సరికొత్త నేషనల్ క్రష్ ఎలాంటి పాత్రలు, సినిమాలు చేసి మెప్పిస్తుందో చూడాలి.

# పూజా అసలైన కంబ్యాక్ ఇదేనా?



సాధారణంగా పెద్ద హీరోల సినిమాలు ఏవైనా వస్తే అందులో అందరి అటెన్షన్ హీరోలపైనే ఉంటుంది. అందులో ఎంత పెద్ద స్టార్ హీరోయిన్ నటించినా ముందుగా అందరూ చూసేది హీరోనే. కానీ ఇప్పుడు కోలీవుడ్ స్టార్ దళపతి విజయ్ పై ఉండాల్సిన ఫోకస్ మొత్తాన్ని బుట్టబొమ్మ పూజా హెగ్డే తన వైపుకు తిప్పేసుకున్నారు. ఇదంతా దేని గురించి అనుకుంటున్నారా? జన నాయగన్ మూవీలోని ఫస్ట్ సింగిల్ దళపతి కచేరి గురించి. ఈ సాంగ్‌లో పూజా హెగ్డే సాంప్రదాయంగా చీరలో కనిపించడమే కాకుండా, విజయ్ ఎనర్జీని మ్యాచ్ చేయడంతో పాటూ శారీలో పూజా అద్భుతమైన లుక్స్, మంచి గ్రేస్‌ఫుల్ మూమెంట్స్‌తో అందరినీ ఎట్రాక్ట్ చేశారు. దీంతో ఇప్పుడామె స్క్రీన్ ప్రెజెన్స్ పెద్ద చర్చనీయాంశంగా మారడంతో దళపతి కచేరి సాంగ్ సక్సెస్ కు పూజా క్రెడిట్ అందుకున్నారు. మోనికా సాంగ్‌తో అలరించిన పూజా దాదాపు రెండు మూడేళ్ల గ్యాప్ తర్వాత పూజా కోలీవుడ్‌కు కంబ్యాక్ ఇవ్వగా, సెకండ్ ఇన్నింగ్స్‌లో పూజా చేసిన ప్రయత్నాలేవీ సక్సెస్ అవలేదు. రీసెంట్‌గా సూర్య తో రెట్రో సినిమా చేసిన పూజా, ఆ మూవీతో మంచి కంబ్యాక్ ఇస్తుందనుకుంటే రెట్రో మూవీ ఫ్లాప్‌గా నిలిచింది. రెట్రో ఫ్లాపైనా రజినీకాంత్ కూలీ మూవీలో మోనికా సాంగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించి ఆ సాంగ్‌ను చార్ట్‌బస్టర్‌గా నిలిపారు. మోనికా సాంగ్‌తో అందరినీ అలరించిన పూజా ఇప్పుడు దళపతి ఆఖరి సినిమాగా వస్తున్న జన నాయగన్ లో ఫీమేల్ లీడ్‌గా కనిపించనున్నారు. ఈ సినిమాలోని ఫస్ట్ సాంగ్‌తో పూజా తన మార్క్‌ను వేయగా, దళపతి సాంగ్‌లో పూజా లుక్స్, డ్యాన్స్ మూవ్స్ హైలైట్‌గా నిలిచాయి. ఈ సాంగ్‌లో కెమెరాను పూజా నడుము, నాభి పైనే ఎక్కువగా ఫోకస్ చేసినందుకు సోషల్ మీడియాలో కొంతమంది మేకర్స్ ను విమర్శించినప్పటికీ ఆడియన్స్ మాత్రం ఆ విజువల్స్‌ను చూసి ఎంజాయ్ చేస్తూ, పూజా గ్లామర్ లుక్స్‌ను అభినం దిస్తున్నారు. తన లుక్స్, డ్యాన్సులు, గ్లామర్‌తో దళపతి కచేరి సాంగ్‌ను రిలీజైన కొన్ని గంటల్లోనే వైరల్ చేసిన పూజాకు ఇది నిజమైన కంబ్యాక్‌లాంటిదని ఆమె ఫ్యాన్స్ భావిస్తూ పూజాని ప్రశంసిస్తూ నాన్‌స్టాప్‌గా హ్యాష్ ట్యాగులను ట్రెండ్ చేస్తున్నారు. ఈ కారణంతోనే పూజా ఇప్పటికీ సౌత్ ఇండి యాలో మోస్ట్ గ్లామరస్ హీరోయిన్లలో ఒకరిగా చలామణి అవుతుందని అందరూ అంటున్నారు. ఇక జననాయగన్ విషయానికొస్తే ఈ సినిమా 2026 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే.

# రాజకీయాలా? సినిమాలా? కంగనా ఆన్సర్ ఏంటంటే..



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కంగనా రనౌత్ సోషల్ మీడియాలో ఉంటూ ఎప్పుడూ ఏదొక వ్యాఖ్యలు చేస్తూ ఏదొక రూపంలో వార్తల్లో నిలుస్తూ ఉంటారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే కంగనా రెగ్యులర్‌గా ఫ్యాన్స్‌తో టచ్‌లో ఉంటూ తన అభిప్రాయాలను షేర్ చేసుకుంటూ ఉంటారు. అందులో భాగంగానే కంగనా చేసే వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారతాయి. ఒకటి సెలెక్ట్ చేసుకోలేను కాగా కంగనా తాజాగా ఫ్యాన్స్‌తో ఇంటరాక్ట్ అవుతూ చాట్ సెషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కంగనాకు ఆమె ఫ్యాన్స్ నుంచి రకరకాల ప్రశ్నలు ఎదురయ్యాయి.

చాట్ సెషన్‌లో భాగంగా ఓ నెటిజన్ మీకు పాలిటిక్స్ ఇష్టమా? సినిమాలు ఇష్టమా అని అడగ్గా, ఆ రెండింటిలో ఒకదాన్ని సెలెక్ట్ చేసుకోలేనని, ప్రస్తుతం రెండూ తనకు సమాన ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయని చెప్పారు. కాలంతో పాటూ మన అభిరుచులు కూడా మారుతాయని, ప్రస్తుతం తన దృష్టి క్రియేటివ్ మరియు పాలిటిక్స్‌పై ఉందని, మనిషి లైఫ్‌లో ఓ విషయంలో మాత్రమే నచ్చాల్సిన పన్లేదని, ప్రతీ దాంట్లో నేర్చుకునే విషయముం టుందని, తనకు రాజకీయాలూ, సినిమాలూ రెండూ ఇష్టమే నని చాలా క్లియర్‌గా చెప్పారు. మరొకర నెటిజన్ నెక్ట్స్ మూవీ గురించి అడగ్గా దానికి సమాధానమిచ్చారు కంగనా. ప్రస్తుతం ఓ కథపై వర్క్ జరుగుతుందని చెప్పిన కంగనా, నెక్ట్స్ ఇయర్‌లో ఆ మూవీ షూటింగ్ మొదలవనుందని చెప్పారు. అయితే ఆ సినిమాలో కంగనా నటిస్తున్నారా లేకా ఆ సినిమా కంగనా దర్శకత్వంలో వస్తుందా అనే విషయంలో మాత్రం కంగనా క్లారిటీ ఇవ్వలేదు కానీ ఓ ప్రాజెక్టుపై మాత్రం తాను వర్క్ చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా తన పెళ్లి గురించి చాలా కాలంగా వస్తున్న రూమర్లపై కూడా ఆమె స్పందించారు. తన పెళ్లి గురించి ఎన్నో వార్తలు విన్నానని, కానీ వాటిలో ఏ మాత్రం నిజం లేదని, పెళ్లి చేసుకోవడం, పిల్లల్ని కనడంపై తనకు ఇంట్రెస్ట్ లేదని, అలాంటి విషయాలు తనకు సూట్ అవవని క్లారిటీ ఇచ్చారు.

# నాటు బాంబు పేలి గాయాల పాలైన రెడ్డి రమేష్‌కు రూ. 50 వేలు ఆర్థిక సాయం అందించిన సిరమ్మ







**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కళాశాగా పనిచేస్తున్న రెడ్డి రమేష్ నాటు బాంబు పేలుడులో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, గౌరవ విజయనగరం జిల్లా పార్టీ అధ్యక్షులు, జడ్పీ చైర్మన్, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన శ్రీనివాస్‌రావు, తన కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ చేతుల మీదుగా బాధిత రమేష్‌కు ఆదివారం 50,000 ఆర్థిక సాయం అందించారు. ఆర్థిక సహాయం కార్యక్రమం మన్యం జిల్లా డాక్టర్ రామ్మోహన్ నాయుడు హాస్పిటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా సిరమ్మ మాట్లాడుతూ, రమేష్ పరిస్థితి చూసి ఎంతో చలించిపోయానని, అతనికి మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని వైద్యులకు సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ కోలనీలో సామాజిక భవనం నిర్మించండి

## - ఎమ్మెల్యే గంటాను కోరిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



**భీమిలి, (రాజధాని వార్తలు):** జోన్ 3వ డివిజన్ ఎన్టీఆర్ కోలనీలో సామాజిక భవనం నిర్మించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుని వినతిపత్రం ద్వారా టిడిపి రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు కోరారు. ఎన్టీఆర్ కోలనీలో ఉన్న పెద్దలు, సంఘసభ్యులతో కలసి ఎమ్మెల్యే గంటాకు వినతిపత్రం ఇచ్చారు. ఇక్కడ స్థానిక ప్రజలు మరియు కొంతమంది ప్రముఖుల ఆర్థిక సహకారంతో వినాయక ఆలయం నిర్మించారని గంటా నూకరాజు తెలియజేసారు. ప్రతీరోజు దూపదీప నైవేద్యాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని రోజురోజుకు భక్తులు పెరుగుతున్నారని, అదేవిదంగా ఇక్కడ ప్రజలు ఏదైనా శుభాకార్యం చేసుకోవాలంటే చాలా ఇబ్బందులకు గురవుతున్నారని దయచేసి వినాయక ఆలయం దర్శనం కోసం వచ్చే భక్తులకు మరియు స్థానిక గ్రామస్తులు శుభకార్యాలు చేసుకోవడానికి ఉపయోగపడే విధంగా సామాజిక భవనం నిర్మించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు ఇచ్చిన వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేసామని గంటా నూకరాజు కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని సంబంధిత అధికారులతో స్థల పరిశీలన చేయించి సామాజిక భవనం నిర్మాణానికి కావలసిన అన్ని ఏర్పాట్లు చేయిస్తానని హామీ ఇచ్చారని గంటా నూకరాజు తెలియజేసారు. ఈ సందర్భంగా సామాజిక భవనం అడిగిన వెంటనే సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకి గ్రామ పెద్దలు, సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అల్లిపిలి వేణు, పీతల అప్పారావు, దాలిబోయిన శ్రీను, వాసుపిల్లి వీరుబాబు, బుత్తల శ్రీను తదితరులు పాల్గొన్నారు.


# అరసాడలో రూ.102 కోట్లతో బయోగ్యాస్ ప్లాంట్

## - నేడు రాజాంలో వర్చువల్‌గా శంకుస్థాపన కార్యక్రమం : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** వంగర మండలం అరసాడ గ్రామంలో పివిఎస్ గ్రూప్ ఆధ్వర్యంలో సుమారు రూ.102 కోట్ల వ్యయంతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు కానుంది. దీని నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కనిగిరి నుండి మంగళవారం ఉదయం 10.30 గంటలకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమాన్ని రాజాం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. అరసాడ గ్రామంలో ప్లాంట్ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రోజుకు 20 టన్నులు ఉత్పత్తి సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 500 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని, నిరుద్యోగ సమస్య కొంత మేర తగ్గుతుందని తెలిపారు. అదేవిధంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక లాభాలు కలుగుతాయని వివరించారు. అనుబంధంగా మరికొన్ని యూనిట్లు వచ్చే అవకాశం ఉందన్నారు. శంకుస్థాపన ఏర్పాట్లు పక్కాగా చేయాలని, వర్చువల్ విధానంలో శంకుస్థాపన వీక్షించడానికి అవసరమైన స్క్రీన్లు, కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, ఆర్డీవో సత్యవాణి, తహసీల్దార్ పి.రామారావు, నెడ్కాప్, ఏపీఈపీడీసీఎల్ అధికారులు, పీవీఎస్ సంస్థ ప్రతినిధి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# ఓం నమశ్శివాయ స్మరణతో మార్మోగిన శివాలయాలు

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** కార్తీక మాసంలో మూడో సోమవారం కావడంతో సోమవారం మండలంలోని శివాలయాలు, పలు దేవాలయాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. గజపతినగరం శివాలయం, అలాగే వెంకటాపురంలోని అభయ ఆంజనేయ ఆలయంలో గల మర్కస శివలింగానికి సహస్ర లింగార్చన చేసి భక్తులు తమ స్వహస్తాలతో సహస్ర దీపలంకరణ చేశారు. సంత తోటలో గల శివాలయం భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక సత్యసాయి మందిరం ఎదుట ఉప్పుగల్లుతో వేసిన శివలింగ ఆకారం విద్యుత్ కాంతుల నడుమ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# మధురవాడకు ల్యాండ్ మార్క్‌గా చంద్రంపాలెం ఫుట్ ఓవర్ బ్రిడ్జి

## - ఆర్నెల్లలో అందుబాటులోకి తీసుకు రావాలన్న గంటా





**మధురవాడ, (రాజధాని వార్తలు):** మధురవాడ ప్రాంతానికి ల్యాండ్ మార్క్ అయ్యేలా చంద్రంపాలెం ఫుట్ ఓవర్ బ్రిడ్జిని అధునాతనమైన డిజైన్‌తో నిర్మించి.. ఆర్నెల్లలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు రూ. 3.23 కోట్లతో ప్రతిపాదించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేసారు అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రంపాలెం ఫుట్ ఓవర్ బ్రిడ్జి మధురవాడ ప్రజల చిరకాల వాంఛని, దురదృష్టవశాత్తు నేషనల్ హైవే, మెట్రో విభాగాల నుంచి అభ్యంతరాలు రావడంతో కొంత ఆల్యమైందని. ఈ అభ్యంతరాల కారణంగానే స్వచ్ఛందంగా బ్రిడ్జి నిర్మాణానికి ముందుకువచ్చిన యాడ్ ఏజెన్సీ యాజమాన్యం వెనక్కి వెళ్లిపోయిందని తెలిపారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి వల్ల మెట్రో ప్రాజెక్టు డిజైన్‌కు ఆటంకం ఏర్పడే అవకాశముందని అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయగా.. మెట్రో ఎండీ రామకృష్ణారెడ్డికి ఫుట్ ఓవర్ బ్రిడ్జి అవసరాన్ని వివరించి డిజైన్ మార్పునకు ఒప్పించానన్నారు. 4 వేల మంది విద్యార్థులతో రాష్ట్రంలోనే అతి పెద్దదైన చంద్రంపాలెం పాఠశాలకు నిత్యం రద్దీగా ఉండే మెయిన్ రోడ్డు దాటి వచ్చే ప్రయత్నంలో అనేకమంది విద్యార్థులు, సామాన్యులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో ఈ సమస్యకు తెర పడుతుందన్నారు. వర్షం పడితే నీరు నిలిచిపోతున్న చంద్రంపాలెం పాఠశాల క్రీడా మైదానానికి శాశ్వత పరిష్కారం చూపించే దిశగా పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి డిజైన్ల ను ఎమ్మెల్యే గంటా పరిశీలించారు.

**విశాఖకు మరిన్ని ప్రాజెక్టులు**

ఈనెల 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సులో రూ. 10 లక్షల కోట్ల పరిశ్రమలకు ఒప్పందాలు జరగనున్నాయని వాటిలో విశాఖ ప్రాజెక్టులు కూడా ఉన్నాయని గంటా చెప్పారు. గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్, సిఫీ, సత్వా వంటి అంతర్జాతీయ సంస్థలు ఏర్పాటు కానుండడంతో విశాఖ రాష్ట్రాభివృద్ధికి గ్రోత్ ఇంజన్ కానుందన్నారు. వచ్చే ఏడాది జులైకి భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో రూ. 175 కోట్లతో 7 మాస్టర్ ప్లాన్ రోడ్లను యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాంతిరాజు, కార్పొరేటర్లు మొల్లి హేమలత, పిల్లా మంగమ్మ, లొడగల అప్పారావు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాడు వెంకటప్పడు, గంటా నూకరాజు, మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు, నాగోతి సత్యనారాయణ, మామిడి దుర్గారావు, కె. అచ్యుతరావు, గరే గుర్నాథ్, మంగాదేవి, గాడు అప్పలనాయుడు, బోయి రమాదేవి, దొరబాబు, పోతిన ప్రసాద్, లొడగల జానకిరాం తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదుదారు సంతృప్తే ముఖ్యం

## - పిజిఆర్ఎస్‌కు 178 వినతులు : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** అధికారులందరూ ఫిర్యాదు లను సకాలంలో పరిష్కరించాటానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరే ట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుండి ఫిర్యాదులు, విజ్ఞప్తులు స్వీకరించారు. మొత్తం 178 ఫిర్యాదులు అండగా వాటిలో అత్యధికంగా 63 దరఖాస్తులు రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాగా, డీఆర్‌డీఏ శాఖకు 29, మున్సిపాలిటీ శాఖకు 08, హౌసింగ్ శాఖకు 09, డిపిఓ కార్యాలయానికి 14, జి.ఎస్.డబ్ల్యు కు 20 చొప్పున అందగా మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి. ప్రజల విజ్ఞప్తులను స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ప్రతి దరఖాస్తుదారు సంతృప్తి చెందే విధంగా పరిష్కారం ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

సమయపాలనతో, పారదర్శకంగా, ప్రతి ఫిర్యాదును నాణ్యవంతంగా పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదులపై ఫాలోఅప్ చర్యలు తీసుకొని, పరిష్కారం వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో డిఆర్ఓ ఎస్.శ్రీనివాస్ మూర్తి, ఎస్డిసిలు వెంకటేశ్వర రావు, మురళి, రాజేశ్వరి, ప్రమీల గాంధీ, బి.శాంతి, కళావతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పలు చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం

## - డిజిటల్ అరెస్టులు చేయడానికి ఎవరైనా ప్రయత్నిస్తే తక్షణమే సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలి : ఎస్సై యు.మహేష్

**గజపతినగరం/ బొండపల్లి, (రాజధాని వార్తలు):** మండలంలోని ముద్దూరు గ్రామంలో గ్రామస్తులను సమావేశపరిచి ఎస్.ఐ యు మహేష్ పలు చట్టాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ యు.మహేష్ మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామస్తులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్టుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆన్లైన్లో తెలియని లింకులను తెరవరాదని సూచించారు. ఎవరైనా డిజిటల్ అరెస్ట్ చేస్తామని బెదిరిస్తే తక్షణమే సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలపై ఏ విధమైన దాడులకు పాల్పడిన కఠినతరమైన ఫోక్సోలాంటి చట్టాలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ప్రయాణాలు చేసేటప్పుడు తప్పనిసరిగా రహదారి నిబంధనలను పాటించాలని, బైకులు నడిపేవారు ప్రాణాపాయం జరగకుండా తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని ఆయన సూచించారు. గ్రామాలలో గంజాయి కొనుగోలు, అమ్మకాలు జరిపితే



అటువంటి వారి సమాచారం అందజేయాలని, గంజాయి వాడకం ప్రాణాంతకం అని ఆయన గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తేగడ ఇసుక ర్యాంపుకు చేపట్టిన తాత్కాలిక రోడ్డు నిర్మాణ పనులు నిలిపి వేయాలి

**- ఆదివాసీ సంక్షేమ పరిషత్ చర్ల మండల అధ్యక్షులు కంగాల అభి, ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ ఇరప. రాజు దొర**





**చర్ల, (రాజధాని వార్తలు):** తేగడ సొసైటీ ఇసుక ర్యాంపుకు చేపట్టిన తాత్కాలిక రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ & ఆదివాసీహక్కులపరిరక్షణవేదిక నాయకులు ది. 10/11/2025, సోమవారం నాడు స్థానిక తహ శీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక ర్యాంపు లారీల కోసం నిర్మించే రోడ్డు వల్ల భవిష్యత్తులో తాలిపేరు నది గతి తప్పే ప్రమాదముందని దీని వల్ల అనేక గ్రామాలు ముంపునకు గురియ్యే పరిస్థితి ఉంద న్నారు.ముందు చూపు లేకుండా ఇరిగేషన్ అధికారులు రోడ్డు నిర్మాణానికి ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు .సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడడం సరికాదని మండిపడ్డారు. తక్షణమే ఇరిగేషన్ అధికారులు అనుమతులన పునః పరిశీలిం చాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కాక నర్సింహారావు, పాయల కన్నారావు, సోడి ముద్దరాజు, కణితి. రామకృష్ణ, ఇరప, రవి, తదితరులు పాల్గొన్నారు.

# చిన్న చిన్న తగాదాలకు కోర్టులను ఆశ్రయించవద్దు : మెజిస్ట్రేట్ ఏ.విజయ్ రాజ్ కుమార్



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గ్రామాల్లో తలెత్తిన చిన్న చిన్న తగాదాలకు పోలీస్ స్టేషన్లను, కోర్టులను ఆశ్రయించకుండా గ్రామ స్థాయిలోనే పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవడం ఉత్త మమని స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏ. విజయ్ రాజ్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కాలంరాజుపేట గ్రామంలో జాతీయ న్యాయ సేవ దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న భూ తగాదాలు, ఇతరత్రా తగాదాలకు పోలీస్ స్టేష న్లను, కోర్టులను ఆశ్రయించడం వల్ల సమయము వృధాతోపాటు, ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. అలాగే ప్రశాంతమైన జీవనాన్ని కోల్పోవలసి వస్తుందన్నారు. న్యాయ సహాయం కోసం తమకు దరఖాస్తు చేస్తే ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తల్లిదండ్రులు వహించాలన్నారు. బాల్యం నుండే క్రమశిక్షణ గల జీవనాన్ని నేర్పించాలన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని, పరిష్కారం కాని సమస్యలకు తమకు ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు, సర్పంచ్ గేదెల ఈశ్వరరావు, న్యాయవాది సాయి శేఖర్ పాల్గొన్నారు.

# శ్రీ ఉమా శాంతేశ్వర ఆలయంలో అన్న సమారాధన



**మక్కువ, (రాజధాని వార్తలు):** కార్తీక మాసం మూడవ సోమవారం పురస్కరించుకొని మండలంలో గల అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శాంతిశ్వర గ్రామంలో గల ఉమా శాంతిశ్వర ఆలయ ప్రాంగణంలో మూడవ సోమవారాన్ని పురస్కరించుకొని అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో మక్కువ మండల వైయస్సార్సీపి అధ్యక్షులు మామిడి రంగు నాయుడు పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. మండల నలుమూలల నుంచి సుమారు 5000 మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసా దాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి రామకృష్ణ, చోడవరపు లక్ష్మణరావు, ముచ్చి వెంకటరావు, చోడవరపు పెద్ద శాంత, మొగిలి సోమేశ్వరరావు, పొన్నాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. మక్కువ ఎస్ఐ ఎం వెంకటరమణ మరియు సిఆర్పి ఎఫ్ బలగాలతో ఆలయ ప్రాంగణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు వారు బందోబస్తు నిర్వహించారు.

# మంచి ఆరోగ్యానికి పునాది ప్రకృతి వ్యవసాయం



**మక్కువ, (రాజధాని వార్తలు):** పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం పనసభద్ర పంచాయతీలో గల దుగ్గేరు గ్రామంలో ఈరోజు మక్కువ వ్యవసాయాధికారి చింతల భారతి గ్రామ సర్పంచ్ ధరపు నాగేశ్వరరావు చేతుల మీదుగా అమృత భూమి ఆర్గానిక్ బయో ఇన్పుట్ రిసోర్స్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో చింతల భారతి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం వాటి ప్రాముఖ్యత వాటి ఆవశ్యకత గురించి తెలియ జేశారు. సహజ సిద్ధంగా పండించిన ఆహార ఉత్పత్తులను తినటం ద్వారా మంచి ఆరోగ్యం కలుగటమే కాకుండా భూమి కూడా సారవంతంగా మారుతుంది అని నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం ద్వారా పర్యావరణాన్ని కాపా డచ్చని ఆమె ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం ఔత్సాహికులకు ప్రకృతి వ్యవ సాయంపై శిక్షణ ఇచ్చి వారికి ఆర్థిక సహాయాన్ని అందజేయడం ద్వారా ఇటువంటి ప్రకృతి వ్యవసాయ కేంద్రాలను ఏర్పాటు దిశగా ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తుందని తెలిపారు. ఈ కేంద్రం నిర్వాహకుడు దిసరివెంకటరావు తాను పార్వతీ పురంలో ప్రకృతి వ్యవసాయ కేంద్రంలో శిక్షణ తీసుకున్నట్లు తెలియజేశారు. ఈ వ్యవసాయ కేంద్రంలో తమ వద్ద ప్రకృతి వ్యవసాయ కషాయాలు ద్రావణాలు పసుపు పల్లాలు నీలం ఫలాలు జీవామృతం ఘన ద్రవ జీవ అమృతం నవధాన్యాలు ఆర్డీఎస్ విత్తనాలు దేశీ విత్తనాలు ఎస్ టూ ఎస్ కిట్లు అన్ని రకాలు అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వెన్నెల ప్రకృతి వ్యవసాయ మండల ఇంచార్జ్ ఊర్లక నాగార్జున గ్రామ పెద్దలు అలాగే ఐ సి ఆర్ పి రెడ్డి సుందర్రావు కొండతామర అప్పలరాజు ఊయక భగత్ మచ్చ చంటి తదితర రైతులు పాల్గొన్నారు.

# వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

**- వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలనే కూటమి యోచన దురదృష్టకరం**
**- ప్రజలిచ్చిన అధికారం అనుభవించడానికి కాదు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించడం కోసం - 12వ తేదీ ర్యాలీలో యువత, మేధావులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి : మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పిలుపు**



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** తమ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని చంద్రబాబు ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని మాజీ శాసనస భ్యులు, వైకాపా నేత బొత్స అప్పల నర్సయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఈనెల 12 తేదీన ప్రైవేటీకరణకు నిరసనగా చేపట్టనున్న "ఉద్యమ ర్యాలీ" పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తమ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు ఈనెల 12వ తేదీన నియోజకవర్గంలో భారీ ర్యాలీ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. సిపిఐ, సిపిఎం పార్టీలతోపాటు పలు పార్టీల మద్దతుతో ఈ కార్యక్రమాన్ని చేపడు తున్నామన్నారు. ఈ సందర్భంగా తాసిల్దార్ కార్యాలయం వరకు వెళ్లి వినతి పత్రం అందజేస్తామన్నారు. ఇప్పటికే ప్రైవేటీకరణకు నిరసనగా తమ పార్టీ చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి విశేష స్పందన ప్రజల నుంచి లభిస్తుందని, ఈ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయనున్నట్లు తెలిపారు. ప్రభు త్వం తన తప్పును తెలుసుకుని ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉ పసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మేధావులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవం తం చేయాలని కోరారు. మొంత తుఫాన్ బాధితులను ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. తుఫాన్ నష్టాన్ని అంచనా వేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. దీనివల్ల రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. తమ నేత జగన్ తుఫాన్ బాధితులను పరామర్శించేందుకు వెళితే అడుగడుగున అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, మండల నాయకులు మండల సురేష్, గజపతినగరం మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, ఎంపీపీ సింహాద్రి అప్పలనా యుడు, జడ్పిటిసి రౌతు రాజేశ్వరి, మాజీ ఎంపీపీ కంది తిరుపతి నాయుడు, మాజీ జెడ్పిటిసి మంత్రి అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులైన కృష్ణార్జునులు, వెంకటరమణ, పి.ఎస్.ఎన్ మూర్తి, ఫణీంద్రుడు, కర్రీ రామునాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఎస్పీ దామోదర్ తనిఖీలు








**గజపతినగరం, (రాజధాని వార్తలు):** జిల్లా ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీలు చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా స్థానిక స్టేషన్ కు వచ్చిన ఆయన పోలీస్ స్టేషన్ పరిసరాలను క్షుణంగా పరిశీలించారు. లాకప్ గదులను, రిసెప్షన్ కౌంటర్లో రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు ను కేసుల వివరాలుపై ప్రశ్నించారు. సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు వాడకంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకోవా లని సూచించారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి డిఎస్పి భవ్యరెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.ఏ.వి రమణ, సబ్ ఇన్స్పెక్టర్ కె.కిరణ్ కుమార్ నాయుడు పాల్గొన్నారు.

# "గురుదేవోభవ" అవార్డు అందుకున్న "చంద్రరావు" మాస్టారు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని మర్రివలస ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కనకాల చంద్రరావు గురుదేవోభవ జాతీయ అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. ఈ అవార్డును ఆదివారం హైదరాబాదులోని సుం దరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చం ద్రరావు మాస్టారు అందుకున్నారు. ప్రముఖ సేవా సంస్థ ప్రగతి ఫౌండేషన్ ఎంపిక చేసిన ఈ అవార్డును ఉపాధ్యాయుడు కనకల చంద్రరావు హర్యానా మాజీ గవర్నర్, మాజీ కేంద్ర మంత్రివర్యులు బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, దైవజ్ఞ శర్మల చేతుల మీదగా అందుకున్నారు. ఈ సందర్భంగా సేవలను వక్తలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వల్లూరి ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ వి.ఆర్.శ్రీనివాసరాజు కూడా పాల్గొన్నట్టు తెలిపారు.

# తాళ్లవలస జడ్పీ హైస్కూల్లో క్రీడలపై విద్యార్థులకు వివరించిన సిఈఓ



**భీమిలి, (రాజధాని వార్తలు):** స్థానిక భీమిలి మండలం తాళ్లవలస జెడ్ పీ హై స్కూల్లో ప్రో కబడ్డీ "తెలుగు టైటాన్స్" సి ఈ ఓ, జె. త్రినాథ్ రెడ్డి సోమవారం విద్యార్థులతో మమేకమై స్ఫూర్తిదాయ కంగా ప్రసంగించారు. విద్యార్థులలో క్రీడల పట్ల ఆసక్తి కలిగించే విధంగా ప్రోత్సహిస్తూ,గ్రామీణ వాతావరణంలో పిల్లల గురించి, వారిలో ఉండే నైపుణ్యాల గురించి విద్యార్థులు గుర్తెరిగేటట్లు వివరించారు. విద్యార్థుల్లో నిబద్ధత, క్రమశిక్షణ, ఉండాలని, ప్రతి విద్యార్థి చిన్ననాటి నుండే ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని, అది సాధించేందుకు నిరంతరతపన ఉండాలని సూచించారు. ఆయన చిన్ననాటి సంగతులు తెలియజేస్తూ, గ్రామీణ పరిస్థితుల నుండి విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవడానికి మార్గాలను సూచించారు. త్రినాధరెడ్డి ప్రసంగం ఆద్యంతం విద్యార్థులందరూ చాలా ఆసక్తిగా విన్నారు. తాను గ్రామీణ ప్రాంతానికి చెందిన చెల్లపేట పుట్టిన ప్పటికీ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే విధంగా ఎదగడానికి చిన్నప్పటినుండి నేను అనుసరించిన నిబద్ధత కష్టపడే తత్వం నలుగురిలో గుర్తింపు పొందాలనే ఆలోచన కారణమని ప్రస్తుత ప్రభుత్వం క్రీడాకారులకు ఎన్నో అవకాశాలు కల్పిస్తుందని కావున మీరు నాకంటే మెరుగైన స్థాయికి రావాలని కోరుకుంటున్నట్లు క్రీడా సంబంధం విషయాలలో మీకు నేను ఎటువంటి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ పాఠశాల నుండి "స్టేట్ లెవెల్ అథ్లెటిక్స్"కు ఎన్నికైన విద్యార్థి "శైలేష్ కుమార్"ను ఈ సందర్భంగా అభినం దించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ. రమేష్ కుమార్, సీనియర్ ఉపాధ్యాయులు నర్సింగ రావు, ఉమామహేశ్వరి, బాలరాజురెడ్డి, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపా ధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మండడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పాస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్స్ కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్‌పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699



# ప్రశాంతంగా మత్స్యకార సహకార సంఘం ఎన్నికలు నిర్వహించాలి


## - సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి



**అల్లవరం, (రాజధాని వార్తలు):** అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామ పంచాయతీ పరిధిలో ఈ నెల 12వ తేదీన నిర్వహించే శ్రీ వెంకటేశ్వర శాండ్ క్వారీ బోట్స్ మెన్ మరియు మత్స్యకార సహకార సంఘం లి. నెం. సి. 13 ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని సర్పంచ్ రొక్కాల విజయ లక్ష్మి ఎన్నికల అధికారులను కోరారు. 1976 లో మత్స్యకార సహకార సంఘం ఏర్పడిన తర్వాత మూజువాణి ఓటుతో ఎన్నికలు జరగగా మొట్టమొదటిసారిగా సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో సొసైటీ ఎన్నిక జరగనుంది. ఈ ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు, ఎన్నికల అధికారులు ప్రతిష్టమైన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ విజయ లక్ష్మి కోరారు. సుమారు 1300 మంది మత్స్యకార సహకార సంఘ సభ్యులు తమ అమూల్యమైన ఓటు హక్కును బ్యాలెట్ ద్వారా ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని సర్పంచ్ సర్పంచ్ విజయలక్ష్మి కోరారు.

# వాకాడలో వైభవంగా కోటి దీపాల సంబరం





**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం వాకాడలో సోమవారం రాత్రి కార్తిక కోటి దీపాల సంబరం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం కార్తిక మాసంలోని మూడవ సోమవారం ఈ ఉత్సవాన్ని గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం వాకాడకు సాంప్రదాయంగా మారింది. రాత్రి వేళ వాకాడ గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలోని శ్రీ రామాలయం ఆవర ణలో పొడవైన సర్వేరాటలు పాతి, వాటిపై వెదురు బద్దలతో అరలుగా చేసి, జిగురు మట్టి ఉంచి, నూనె నింపిన ప్రమిదలను అమర్చి, వత్తెలను వెలిగించారు. కోటికి సమానంగా దీపాలు వెలిగించడమే లక్ష్యంగా భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం, వీధులు, ఇంటి మేడలు అన్నీ దీపాల కాంతులతో ప్రకాశించి ఆప్రదేశమంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి. ఈ సందర్భంగా వాకాడ పరిసర గ్రామాలైన వేములవాడ, కూరాడ, వలస పాకలా, కరప వేళంగి మొదలైన చోట్లనుండి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి కోటి దీపాలను సందర్శించి తమ వంతుగా ఒత్తులు వెలిగించి ఈ కోటి దీపాల ఉత్సవంలో భాగమయ్యారు. చింతామణి, సత్య హరిచంద్ర పౌరాణిక నాటకాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఈ కార్యక్రమానికి మరింత విశేషతను చేకూర్చాయి. గ్రామ ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగేందుకు పటిష్ట ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రతా ఏర్పాట్లను సమర్ధవంతంగా నిర్వహించారు.

# మార్కాపురంలో ఘనంగా కాపు వన మహోత్సవం

**ఒంగోలు, (రాజధాని వార్తలు):** ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మార్కాపురం పట్టణంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా మార్కాపురం నియోజక వర్గం కాపు వన మహోత్సవం ఘనంగా, వైభవంగా జరిగింది. ప్రకృతి సోయగాల నడుమ కాపు కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం కాపు, తెలగ, ఒంటరి, తూర్పుకాపు, మున్నూరు కాపు వర్గాల మధ్య ఐక్యతను బలోపేతం చేసి, సమాజాన్ని ఒకే తాటిపైకి తీసుకు వచ్చి రాజ్యాధికార దిశగా కాపు సమాజాన్ని నడిపించడమని పలు వురు వక్తలు పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, యువత మరియు పిల్లల కోసం పాటల పోటీలు, చెయిర్ గేమ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు వంటి వినోదాత్మక అంశాలు నిర్వహించబడ్డాయి. విజేతలకు బహుమతులు అందజేయడంతో పాటు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్కెస్ట్రా కార్యక్రమానికి మరింత ఉత్సాహాన్ని తెచ్చింది. మొత్తం 20 రకాల రుచికరమైన వంటకాలతో భోజన విందు ఏర్పాటు చేయడం విశేషంగా చెప్పుకోవచ్చును. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కాపురం జనసేన ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్, మాజీ ఏఎంసీ చైర్మన్ అయినాబత్తిన ఘనశ్యామ్, అవిసి నేని వెంగన్న (చీమకుర్తి సీనియర్ కాపు నాయకులు), బీజేపీ మార్కా పురం ఇన్‌చార్జ్ కె.వి.కృష్ణారావు, ప్రకాశం జిల్లా కాపునాడు అధ్యక్షులు పోగుల మల్లికార్జున, కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీమన్నారాయణ, ప్రకాశం జిల్లా కార్యదర్శి దాసరి పిచ్చయ్య నాయుడు పాల్గొని సమాజ ఐక్యతకు పిలుపునిచ్చారు. ఈ అతిథులందరినీ మార్కాపురం కాపు వన మహోత్సవ ఆహ్వాన కమిటీ తరఫున ఘనంగా శాలువా మరియు మోమెంటోతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా కాపునాడు ఉపాధ్యక్షులు చెంగలశెట్టి సుధాకర్, యువజన అధ్యక్షులు బండారు సురేష్, గారా నారాయణ రావు,ఒంగోలు నియోజక వర్గం కాపునాడు మహిళా అధ్యక్షురాలు నగుబోతు నిర్మల, మార్కాపురం నియోజక వర్గం మహిళా అధ్యక్షురాలు సిద్ధం కృష్ణవేణి, కాపు మహిళా నేతలు లక్ష్మీ ప్రసన్న, తోట కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న వృద్ధాశ్రమం పనులను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం పరిశీలించారు. తెదేపా నాయకులు రాజా సూరిబాబు రాజు, తహసిల్దార్ సిహెచ్ వెంకటలక్ష్మి సమక్షంలో వృద్ధాశ్రమ నిర్మాణానికి గాను చేస్తున్న ఏర్పాటులను ఎమ్మెల్యే పరిశీలిం చారు. ఈ సందర్భంగా వృద్దులు నివాసముండే ప్రధాన భవనం, గోశాల, గ్రీన్ బెల్ట్, రహదారులు ఏర్పాటు వంటి పనులపై ఎమ్మెల్యే కాంట్రాక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. వయసు పైబడిన వారు నివాసం ఉండే వృద్ధాశ్రమం దేవాలయం లాంటిదని అన్ని వసతులతో దీనిని నిర్మించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బడుగు



శ్రీకాంత్, అడబాల కుమార స్వామి, తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan